బాధ్యతలకు సత్కారం



ఇరవై సూత్రాల అమలు ఛైర్మన్‌గా జిల్లాకు చెందిన లంకా దినకర్ అమరావతిలోని సచివాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయన్ను రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ(సత్య), రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దినకర్‌కు శాలువా కప్పి సత్కరించారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

బదిలీల్లో అక్రమాలపై విచారణకు త్రిసభ్య కమిటీ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ గ్రేడ్-5, 6 కార్యదర్శుల బదిలీల్లో అక్రమాలు, నగదు వసూళ్లపై పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే డీపీవో కార్యాలయ పూర్వ ఏవో శివప్రసాద్, జూనియర్ సహాయకుడు కిషోర్, డిజిటల్ సహాయకుడు సాయి కోటేశ్వరరావును అధికారులు ఇప్పటికే సస్పెండ్ చేయడంతో పాటు, వారిపై ఒంగోలు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయించారు. ఆరోపణల నేపథ్యంలో పూర్వ డీపీవో, ప్రస్తుత ఒంగోలు డీఎల్‌డీవో ఉషారాణిపై ఇప్పుడు పూర్తిస్థాయి విచారణకు సిద్ధమయ్యారు. ఈ నెల 21, 22 తేదీల్లో కలెక్టరేట్‌లోని ఫారెస్ట్ సెటిల్‌మెంట్ కార్యాలయంలో విచారణ చేపట్టనున్నారు. అందుకుగాను ఎస్‌డీసీ లోకేశ్వరరావు ఛైర్మన్‌గా జడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా ఆడిట్ అధికారి శంకర నారాయణరెడ్డి సభ్యులు కమిటీని నియమించారు. ఈ మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శుల బదిలీలతో పాటు, సచివాలయాల సందర్శనకు వెళ్లిన సమయంలో ఉద్యోగుల నుంచి నగదు వసూలు చేశారన్న ఆరోపణలపై వీరు విచారణ చేపట్టనున్నారు.

ఒంగోలు కార్పొరేషన్‌కు ఝలక్

◗ కంప్యూటర్లు, బల్లలు, బీరువాల జప్తు



ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా ప్రైవేట్ భూమిలో రహదారి నిర్మించడంతో పాటు పరిహారం చెల్లించకపోవడంపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధితులకు న్యాయం చేయకపోవడంపై చర్యలకు ఉపక్రమించింది. పరిహారం చెల్లించనందుకు కార్యాలయ కంప్యూటర్లు, బల్లలు, బీరువాలను జప్తు చేస్తూ ఝలక్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. అబ్బూరి ఆదిశేషయ్య, అబ్బూరి విజయబాబు, శెనగళ్ల సుబ్బారెడ్డిలకు ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని ముక్తినూతలపాడు గ్రామ సర్వే నం.202లో భూమి ఉంది. అనుమతి లేకుండా మున్సిపల్ అధికారులు ఆ భూమిలోని కొంతభాగంలో సిమెంట్ రహదారి నిర్మించారు. ఇందుకుగాను తమకు పరిహారం చెల్లించాని సదరు వ్యక్తులు కోరినప్పటికి అధికారులు స్పందించలేదు. దీంతో బాధితులు 2001లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారించిన కోర్టు సేకరించిన భూమి విలువైన రూ. 2,94,000లకు 2005 నుంచి 12 శాతం వడ్డీ, ఖర్చులతో కలిపి పరిహారం చెల్లించాలంటూ 2023 మార్చిలో తీర్పు చెప్పింది. అయినా నగరపాలక సంస్థ ఖాతరు చేయలేదు. దీంతో బాధితులు తిరిగి విషయాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇప్పటి వరకు బాధితులకు రూ. 9,38,296 మేర చెల్లించాల్సి వస్తుందని.. అందుకు సమాన విలువైన ఓఎంసీ కార్యాలయంలోని కంప్యూటర్లు, బల్లలు, బీరువాలను జప్తు చేయాలంటూ ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్. హేమలత తీర్పు చెప్పారు. ఈ మేరకు ఓఎంసీ కార్యాలయంలోని సామగ్రిని శనివారం జప్తు చేశారు.

అప్పు తీర్చలేదని అపహరణ

◗ అర్ధరాత్రి వరకు దుకాణంలో నిర్బంధం

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం మండలం గోగులదిన్నె గ్రామానికి చెందిన మేకల నాగారాజు అనే దళిత యువకుడు పెద్దారవీడు మండలం దేవరాజుగట్టుకు చెందిన మెట్టు రంగారెడ్డి ఇనుప దుకాణంలో పని చేస్తున్నారు. ఈ క్రమంలో నాగరాజు తన పరిచయస్థులకు ఆ దుకాణంలో ఇనుమును అప్పుగా ఇప్పించారు. తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం యజమాని వద్ద కొంత నగదు అప్పుగా తీసుకున్నారు. అంతా కలిపి సుమారు రూ.5 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాన్ని చెల్లించాలని యజమాని రంగారెడ్డి అతన్ని కొద్దిరోజులుగా కోరుతున్నారు. ఇదిగో అదిగో అంటూ నాగరాజు కాలయాపన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రంగారెడ్డితో పాటు అతని స్నేహితుడు బట్టగిరి రంగారెడ్డి శుక్రవారం ఉదయం బాధితుడి స్వగ్రామం అయిన గోగులదిన్నె వచ్చారు. దుకాణంలో పని ఉందంటూ ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని తీసుకెళ్లారు. అనంతరం తన దుకాణంలో నిర్బంధించి డబ్బులు ఇవ్వాలంటూ దూషించారు. అనంతరం షట్టర్‌కు తాళం వేసి రంగారెడ్డి ద్వయం ఇళ్లకు వెళ్లిపోయారు. రాత్రి 11 గంటలైనా ఎంతకు షటర్ తాళం తీసి ఇంటికి రాకపోవడంతో నాగరాజు భార్య అర్ధరాత్రి 12 గంటల సమయంలో మార్కాపురం డీఎస్పీ, సీఐలతో పాటు 100కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన మార్కాపురం గ్రామీణ ఎస్సైతో పాటు సిబ్బంది బాధితుడి చరవాణి సిగ్నల్స్ ఆధారంగా దుకాణంలో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం షట్టర్ తాళం పగులగొట్టి అతన్ని రక్షించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఊడ్చేసిన వరుణుడు



భారీ వర్షానికి కాలువను తలపిస్తున్న ఒంగోలు నగరంలోని కర్నూలు రోడ్డు.. వాహన చోదకుల ఇక్కట్లు

- ◗ జిల్లాను వీడని వానలు
- ◗ పంట నష్టం రూ.350 కోట్లు
- ◗ మళ్లీ అల్పపీడనం హెచ్చరికలు
- ◗ ఆందోళన చెందుతున్న అన్నదాతలు

జిల్లాను అక్టోబర్ గండం పట్టుకుంది. వాయుగుండం ప్రభావంతో గత కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెలలో సాధారణం కంటే ఇప్పటికే అధిక వర్షపాతం నమోదైంది. అల్పపీడనం తీరం దాటిందని జిల్లా వాసులు ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం తగ్గినట్లే తగ్గి శనివారం మళ్లీ వరుణుడు తన ప్రతాపం చూపాడు. జిల్లాలోని చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. గుండ్లకమ్మ జలాశయానికి ఎగువ నుంచి 3,800 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో 6, 7 గేట్ల ద్వారా దిగువకు 7,057 క్యూసెక్కులు వదులుతున్నారు. వర్షపు నీటి ఉద్ధృతికి వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో కొన్నిచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. వరుస వానలతో పంట నష్టాలూ పెరుగుతున్నాయి. ఇప్పటివరకు ఆరు రకాల పంటలకు సంబంధించి 3,427 మంది రైతులు నష్టపోయినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా గుర్తించింది. ఇదిలా ఉంటే మరో రెండు రోజుల్లో అల్పపీడన ప్రభావం జిల్లాపై ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. -ఈనాడు, ఒంగోలు- న్యూస్‌టుడే, ఒంగోలు



పంట	గ్రామాలు	మండలాలు	విస్తీర్ణం	రైతులు
సజ్జ	58	12	1,883	1,642
మినుము	19	03	844	625
జొన్న	01	01	03	02
అలసంద	10	01	1,050	876
ప్రత్తి	02	01	250	184
వరి	04	03	120	99



కంభం: ఓ మిరప చేనులో నిలిచిన నీరు

◗ **అక్టోబర్‌లోనే అధికం నమోదు...:** అక్టోబరు నెలలో సాధారణ వర్షపాతం 147.2 మిల్లీ మీటర్లు. ఈ ఏడాది శనివారం వరకు అంతకు మించి ఇప్పటికే 192.1 మిల్లీ మీటర్లుగా నమోదైంది. శనివారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సింగరాయకొండలో 86.2మి.మీ వర్షపాతం కురిసింది. జరుగుమల్లి(65.6); కొనకనమిట్ల(56.6); కొత్తపట్నం(34.4); గిద్దలూరు(34.2); టంగుటూరు(29.9); కురిచేడు(29.4); బేస్తవారపేట(29.0); మార్కాపురం(29.0) మి.మీ వర్షపాతం నమోదైంది.



సింగరాయకొండ: కాలువ గండిని ఇసుక బస్తాలతో పూడుస్తున్న రైతులు

మొత్తం 4,150 హెక్టార్లు...

భారీ వర్షాలతో సజ్జ, మినుము, జొన్న, అలసంద, పత్తి, వరి పంటలకు నష్టం వాటిల్లింది. సజ్జ, వరి, జొన్న కోత దశలో ఉండగా., మినుము, అలసంద ఏపుగా పెరిగే దశలో ఉంది. కొన్నిప్రాంతాల్లో పొగాకు, ఉద్యాన పంటలకూ నష్టం తప్పలేదు. ముఖ్యంగా దొనకొండ, ముండ్లమూరు, కురిచేడు, తాళ్లూరు, కొనకనమిట్ల, పొదిలి, వెలిగండ్ల, కనిగిరి, హనుమంతునిపాడు, సీఎస్‌పురం, పామూరు, బేస్తవారపేట, మార్కాపురం, త్రిపురాంతకం, నాగులుప్పలపాడు, చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లో పంట నష్టాలు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 4,150 హెక్టార్లలో పంటలు నీట మునిగాయని., 21 మండలాల్లోని 94 గ్రామాలపై వర్షం ప్రభావం తీవ్రంగా ఉందని.. తద్వారా రూ. 350 కోట్ల వరకు నష్టం ఉంటుందని వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాలను ప్రభుత్వానికి నివేదించింది.



పొదిలి: కొండాయపాలెంలో రంగు మారిన సజ్జ కంకులను పరిశీలిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, మర్కాపురం ఎమ్మెల్యే కందుల, జేడీఏ శ్రీనివాసరావు

◗ **ప్రజాప్రతినిధులు, అధికారుల పరిశీలన..:** వర్షాలకు దెబ్బతిన్న పంటలను అధికారులతో కలిసి ప్రజాప్రతినిధులు శనివారం పరిశీలించారు. పొదిలి మండలం కొండాయపాలెంలో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, మర్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల వెతలు తెలుసుకున్నారు. తాళ్లూరు మండలం రామభద్రాపురం వద్ద బూజుపట్టి నల్లగా మారి మొలకలు వచ్చిన జొన్న పంటను, మాధవరం సమీపాన కుళ్లిపోయిన గుమ్మడికాయల పంటలను తెదేపా నేత గొట్టిపాటి లక్ష్మితో కలిసి మంత్రి, కలెక్టర్ శనివారం సాయంత్రం పరిశీలించారు. వర్షాలకు రూ. 350 కోట్ల విలువైన పంటలు దెబ్బతిన్నాయని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని మంత్రి స్వామి తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం, పెట్టుబడి రాయితీ అందించి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

నీవైనా చెప్పు ఆంజనేయా!

- దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం
- నిషేధిత జాబితాలో చేరిన గ్రామకంఠం




రేడియో బావి కూడలిలోని ఆంజనేయస్వామి దేవస్థానం

దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం గిద్దలూరు వాసులకు తిప్పలు తెచ్చి పెట్టింది. అనాలోచితంగా చేసిన ఓ పని ఎనిమిదేళ్లుగా పలువురిని ఇబ్బందులకు గురిచేస్తోంది. పరిశీలించి తప్పు సరిదిద్దుకోవాల్సిన యంత్రాంగం తమకేం పట్టనట్లు వ్యవహరిస్తోంది. సమస్య పరిష్కరించాలని కోరుతున్నా చెవికెక్కించుకోవడం లేదు. ఉన్నతాధికారులూ ఈ విషయంలో ఉలకడం లేదు.. పలకడం లేదు. ప్రజాప్రతినిధులూ పట్టించుకోవడం లేదు.

–న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

◗ **ఇదీ విషయం:** గిద్దలూరు రెవెన్యూ సర్వే నంబరు 435/1లో 30.64 ఎకరాల గ్రామకంఠం భూమి ఉంది. గ్రామం ఏర్పడినప్పటి నుంచి రహదారులు తదితరులు పోను సుమారు 25 ఎకరాల్లో రెండు వేలకు పైగా నివాస గృహాలు అందులో స్థానికులు నిర్మించుకున్నారు. నివాస గృహాలతో పాటు పట్టాభిరామస్వామి, శ్రీ భద్రకాళి, వేంకటేశ్వరస్వామి, రామభజన మందిరం, ఆంజనేయస్వామి దేవస్థానాలూ వెలిశాయి. ఆయా దేవాలయాల విస్తీర్ణం అర ఎకరాకు మించి లేవు. ఇదిలా ఉండగా 2016లో అప్పటి దేవాదాయ శాఖ అధికారులు ఈ అయిదు దేవస్థానాల విస్తీర్ణాన్ని పేర్కొనకుండా తమకు చెందిన భూములుగా జిల్లా రిజిస్ట్రేషన్‌కు శాఖకు జాబితా అందజేశారు. అక్కడ కూడా అధికారులు పరిశీలించకుండానే సర్వే నంబరు 435/1ని నిషేధిత జాబితాలో చేర్చారు.

◗ **అమ్మలేరు.. అవసరాలు తీర్చుకోలేరు...:** అధికారులు చేసిన ఈ తప్పిదంతో గత ఎనిమిదేళ్లుగా గ్రామకంఠంలో గృహాలు నిర్మించుకుని నివాస ఉంటున్న యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. తమ కుటుంబ అవసరాలకు ఇళ్లను విక్రయించే సమయంలో రిజిస్ట్రేషన్లు కావడం లేదు. దీంతో క్రయవిక్రయాలకు ఆస్కారం లేకుండా పోయింది. చేసేదేమీ లేక ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు నగదు తీసుకుని అవసరాల నుంచి గట్టెక్కుతున్నారు. చేసిన అప్పులు తీర్చలేక పలు కుటుంబాలు వీధిన పడాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ విషయంపై గిద్దలూరు గ్రూప్ దేవాలయాల ఈవో చిక్కుడు శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరింది. దీనికి ఆయన మాట్లాడుతూ.. తనకు ఆ విషయం ఏమీ తెలియదంటూ సమాధానమివ్వడం గమనార్హం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని గిద్దలూరు వాసులు కోరుతున్నారు.



మీభూమి వెబ్‌సైట్‌లో గ్రామకంఠంగా నమోదైన దృశ్యం


దొరికిపోయిన

గ్రానైట్ అక్రమం

ఈనాడు, ఒంగోలు: గెలాక్సీ గ్రానైట్ రాళ్లు అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. కంటెయినర్లలో అనుమతుల్లేకుండా రాత్రి వేళల్లో జిల్లా సరిహద్దులు దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు మాత్రమే అధికారులకు దొరికిపోతున్నారు. చీమకుర్తి ప్రాంతం నుంచి చెన్నై ఓడరేవుకు అక్రమంగా తరలిస్తున్న ఆరు కంటెయినర్లను ఒంగోలు కర్నూలు రోడ్డులో శనివారం తెల్లవారుజామున జిల్లా గనుల శాఖ అధికారులు పట్టుకున్నారు. తనిఖీ చేయగా గ్రానైట్ పరిశ్రమల నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అనంతరం సదరు వాహనాలను తదుపరి చర్యల నిమిత్తం ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. హైదరాబాద్‌కు అక్రమంగా గ్రానైట్ స్లాబ్‌లు తరలిస్తున్న మరో రెండు లారీలను కనిగిరి వద్ద పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. గ్రానైట్ స్లాబ్‌లు అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా గనుల శాఖ అధికారి రాజశేఖర్ హెచ్చరించారు. ఈ నెలలో ఇప్పటి వరకు గ్రానైట్ ముడిరాయి, స్లాబ్స్‌ను తరలిస్తున్న మరో 12 వాహనాలను అధికారులు వేర్వేరు ప్రాంతాల్లో ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో గనుల శాఖ అధికారులు రవివర్మ, అరవింద్, సురేష్‌బాబు, రాజినాయుడు పాల్గొన్నారు.



గనుల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న కంటెయినర్లు



● పెద్దదోర్నాలకు చెందిన ఓ పది సంవత్సరాల బాలుడి తల్లి అతని చిన్న వయస్సులోనే మృతి చెందింది. ఆధారమైన తండ్రేమో 2020లో కరోనా బారిన పడి ప్రాణాలు విడిచారు. జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యులు అతడిని విద్య నిమిత్తం తిరుపతిలోని ఓ స్వచ్ఛంద సంస్థలో చేర్పించారు. మిషన్ వాత్సల్య పథకం కింద అతనికి లబ్ధి అందించాలని దరఖాస్తు చేశారు. అయినా గత సర్కారు కనికరించలేదు.

● గిద్దలూరుకు చెందిన ఓ బాలుడి తండ్రి అతని చిన్న వయస్సులోనే ప్రాణాలు కోల్పోయారు. తల్లి ప్రాణాలను కరోనా మహమ్మారి 2021లో కబళించింది. సదరు బాలుడు ఆర్థిక సహాయం నిమిత్తం అప్పట్లోనే దరఖాస్తు చేసుకున్నారు. కానీ వైకాపా ప్రభుత్వం మంజూరు చేయలేదు.

వాత్సల్యం చూపని వైకాపా

◗ 'కొవిడ్'తో అనాథలుగా చిన్నారులు ◗ గత ప్రభుత్వంలో కొందరికే లబ్ధి ◗ దరఖాస్తుల స్వీకరణతోనే మమ

ప్రపంచ దేశాలను కొవిడ్-19 గడగడలాడించింది. తల్లిదండ్రులను కోల్పోయి ఎందరో చిన్నారులను అనాథలుగా మిగిల్చింది. ఇలాంటి పరిస్థితుల్లో నాటి ప్రభుత్వాలు స్పందించాయి. తల్లిదండ్రుల్లో ఎవరూ మృతి చెందినా ఆ కుటుంబానికి చెందిన పిల్లలను 'మిషన్ వాత్సల్య' కింద ఆదుకుంటామంటూ 2021లో ప్రకటించాయి. ప్రత్యేకించి కరోనాతో మృతి చెందిన కుటుంబాల పిల్లలను అన్ని విధాలా ఆదుకోనున్నట్లు అప్పటి వైకాపా ప్రభుత్వం ప్రకటించింది. ఆచరణలో మాత్రం వారి పట్ల వాత్సల్యం చూపకుండా నిర్లక్ష్యం వహించింది.

–న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

నిరీక్షణలోనే పద్దెనిమిదేళ్లు పూర్తి...

'మిషన్ వాత్సల్య' పథకం కింద అర్హులైన వారి నుంచి జిల్లావ్యాప్తంగా దరఖాస్తులు స్వీకరించారు. కొవిడ్‌తో పాటు, ఏ కారణంతోనైనా తల్లిదండ్రులను కోల్పోయిన 18 సంవత్సరాల్లోపు పిల్లల నుంచి మొత్తం 23,797 దరఖాస్తులు అధికారులకు అందాయి. అందులో తొలి విడతగా 448 మందిని ఎంపిక చేశారు. వారికి 2021 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2023 సెప్టెంబర్ వరకు నెలకు రూ.4 వేలు చొప్పున బ్యాంక్ ఖాతాలకు జమ చేశారు. మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకున్న పిల్లలు ఇంకా 20 వేల మందికి పైగానే లబ్ధి కోసం ఎదురు చూస్తున్నారు. మిగతా వారు దరఖాస్తు చేసుకుని గత రెండు, మూడేళ్లుగా నిరీక్షిస్తూనే 18 సంవత్సరాలు పూర్తయ్యాయి. దీంతో నిర్ణీత వయస్సు దాటిన వారందరూ అనర్హులు కానున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి కరోనా కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలపై వాత్సల్యం చూపి లబ్ధి చేకూర్చాలని బాధితులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు:	తల్లిదండ్రులను కోల్పోయినవారు:	అందులో లబ్ధి పొందింది:	తల్లి లేదా తండ్రిని కోల్పోయినవారు:	అందులో లబ్ధిదారులు:	హెచ్ఐవీ బాధిత పిల్లలు:	లబ్ధి చేకూరింది:
23,797	634 మంది	107 మంది	22,977 మంది	305 మంది	186 మంది	36 మంది

జిల్లా వివరాలు



ఐసీడీఎస్ ప్రాజెక్టులు:	13
అంగన్‌వాడీ కేంద్రాలు:	2,903
మరుగుదొడ్లు మంజూరైనవి:	574
కేటాయించిన నిధులు:	రూ.2.66 కోట్లు
తాగునీటి సౌకర్యం కల్పించనున్నవి	721
కేటాయించిన నిధులు:	రూ.1.23 కోట్లు

అంగన్‌వాడీల ద్వారా లబ్ధిదారుల వివరాలు

మూడేళ్లలోపు చిన్నారులు:	03- 06 సంవత్సరాల్లోపు చిన్నారులు:
6,50,222	51,531
బాలింతలు: 12,880	గర్భిణులు 10,880

అంగన్‌వాడీ కేంద్రాలకు

మహర్దశ

- మౌలిక వసతుల కల్పనకు చర్యలు
- జిల్లాకు రూ.3.30 కోట్లు మంజూరు

మాతాశిశు సంరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో కీలకం. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు అవి ఎంతగానో దోహదం చేస్తుంటాయి. ఇంతటి కీలకమైన కేంద్రాలను గత అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం అంతగా పట్టించుకోలేదు. చాలాచోట్ల వాటి నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో కేంద్రాలకు వచ్చేవారు అత్యవసరమైతే మరుగుదొడ్లు లేక ఆందోళన చెందేవారు. దాహార్తి తీర్చుకునేందుకు గుక్కెడు నీరు లభించక ఇబ్బందులు పడేవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిపై దృష్టి పెట్టింది. జిల్లా వ్యాప్తంగా పక్కా భవనాలున్న కేంద్రాలకు మరుగుదొడ్లు, తాగునీటి వసతులు కల్పించనుంది. ఇందుకు రూ. 3.30 కోట్లు మంజూరు చేసింది. –న్యూస్‌టుడే, బేస్తవారపేట

◗ **నాడు అసౌకర్యాలతో అవస్థలు...:** గత వైకాపా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలపై నిర్లక్ష్యం ప్రదర్శించింది. దీంతో సిబ్బందితో పాటు కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, ఇతర లబ్ధిదారులు అవస్థలు ఎదుర్కొన్నారు. అత్యవసర సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలోని చాలా కేంద్రాల్లో ఇదే దుస్థితి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం సొంత భవనాలున్న కేంద్రాల్లో 574 మరుగుదొడ్లు, 721 చోట్ల తాగునీటి వసతి కల్పనకు తొలి విడతగా చర్యలు చేపట్టింది. ఈ మేరకు సదుపాయాలు కల్పించాల్సిన కేంద్రాలను ఇప్పటికే అధికారులు గుర్తించారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు చొప్పున అందించనున్నారు. పనుల పర్యవేక్షణ బాధ్యతను జిల్లా నీటి సరఫరా శాఖ(ఆర్‌డబ్ల్యూఎస్)కు అప్పగించారు. ఈ విషయమై ఐసీడీఎస్ పీడీ కె. మాధురి మాట్లాడుతూ.. తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించి శరవేగంగా పూర్తి చేయించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


త్వరలో కేంద్ర ఆరోగ్య బృందం పర్యటన

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కేంద్ర ఆరోగ్య బృందం ఈ నెల 21, 22 తేదీల్లో జిల్లాలో పర్యటించనుందని.. అన్ని పీహెచ్‌సీల సిబ్బంది తగు సమాచారంతో సిద్ధంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్ కుమార్ ఆదేశించారు. ప్రోగ్రాం అధికారులతో ఒంగోలులోని తన కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక, ఏరియా ఆసుపత్రులను బృందం సభ్యులు పరిశీలిస్తారని తెలిపారు. మాతృ శిశు మరణాలు, ఎంఐఎస్ యాప్, కుటుంబ సంక్షేమ కార్యక్రమం, జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ, అసంక్రమిత వ్యాధులు, జాతీయ ఆరోగ్య పథకాలకు సంబంధించిన పూర్తి వివరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రోగులకు అందిస్తున్న సేవలను కూడా పరిశీలిస్తారని చెప్పారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పద్మజ, డీపీఎంవో వాణీశ్రీ, ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ భగీరథి, మలేరియా నివారణ అధికారి శ్రావణ్ కుమార్, గణాంక అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యశాఖ ప్రోగ్రాం అధికారులతో సమావేశమైన డీఎంహెచ్‌వో సురేష్ కుమార్

అయిదేళ్ల నిర్లక్ష్యం.. ప్రయాణికులకు శాపం


వర్షాలకు అధ్వానంగా మారిన టంగుటూరు-కొండపి రహదారి


భారీ గుంతలో చేరిన నీరు

న్యూస్‌టుడే, టంగుటూరు

అయిదేళ్ల వైకాపా నిర్లక్ష్య పాలనకు నిదర్శనమే టంగుటూరు నుంచి జాతీయ రహదారికి చేరుకునే రోడ్డు. ప్రజలు అధ్వాన రహదారితో అవస్థలు పడుతున్నా నాటి పాలకులు ఏమాత్రం చలించలేదు. అడుగుకో గుంత చొప్పున ఏర్పడి ఒళ్లూ వాహనాలు గుల్లయినా పట్టించుకోలేదు. ప్రయాణికుల ఇబ్బందులు చూసి పలు సార్లు కొందరు దాతలు స్పందించి గుంతలు పూడ్పించారు. మళ్లీ ఇప్పుడు వర్షాలకు ఈ రోడ్డు దారుణంగా మారింది. కూటమి ప్రభుత్వమైనా తక్షణం స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కిలో మీటరుకు మూడు వందల పైనే..

టంగుటూరు-కొండపి మార్గంలో టంగుటూరు నుంచి పదహారో జాతీయ రహదారి వరకు ఒక కిలో మీటరు దూరం ఉంది. అయిదేళ్ల వైకాపా పాలనలో దీని అభివృద్ధిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ కారణంగా ప్రస్తుత వర్షాలకు మరింత దెబ్బతింది. కిలోమీటరు దూరంలో అడుగు నుంచి పది అడుగుల విస్తీర్ణం గల గుంతలు సుమారు మూడు వందలకు పైగానే ఉన్నాయి. వీటిలో నీరు నిలిచిపోవడంతో వాటిని అంచనా వేయలేక వాహనాలు అదుపుతప్పుతున్నాయి. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ నాగార్జునను వివరణ కోరగా. . టంగుటూరు నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డు మరమ్మతులకు అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించారు. ఎన్‌డీబీ నిధులతో ఈ రోడ్డును అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపాం. మొదటి విడతలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

పంట నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం


రామభద్రాపురంలో మొలకలు వచ్చిన జొన్న కంకులు పరిశీలిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, గొట్టిపాటి లక్ష్మి తదితరులు

తాళ్లూరు, న్యూస్‌టుడే: భారీ వర్షాల వల్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. తాళ్లూరు మండలంలోని రామభద్రపురం వద్ద దెబ్బతిన్న జొన్న పంటను, మాధవరం సమీపంలో కుళ్లిపోయిన గుమ్మడికాయల పంటలను శనివారం సాయంత్రం ఆయన కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు, ఉద్యానవన శాఖ డీడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, మరికొందరు రైతులు పంట నష్టం వివరాలను మంత్రికి తెలియజేశారు. మంత్రి మాట్లాడుతూ.. రైతులకు త్వరలో ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా చూస్తామన్నారు. తాళ్లూరులో విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కొందరు రైతులు, ఇతరులు వివిధ సమస్యలపై మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. పొదిలి, తాళ్లూరు, మార్కాపురం, ఇతర ప్రాంతాలకు చెందిన 3,200 మంది రైతులకు చెందిన సజ్జ, జొన్న, పెసర పంటలు దెబ్బతిన్నాయని, రూ.300 నుంచి రూ.400 కోట్ల వరకు పంట నష్టం వాటిల్లినట్లు కలెక్టర్ తెలిపారు. వీటిపై ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ తెదేపా నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఉద్యాన శాఖాధికారి గోపీచంద్, ఏడీఏ బాలాజీనాయక్, తహసీల్దారు కె.నాగలక్ష్మి, ఏవో ప్రసాదరావు, తెదేపా నాయకులు పాల్గొన్నారు. ❖ పొదిలి గ్రామీణం: మండలంలోని కొండాయపాలెంలో మంత్రి స్వామి పర్యటించి వర్షాలకు దెబ్బతిన్న సజ్జ, పొగాకు పంటలను పరిశీలించారు. తెదేపా ప్రభుత్వం రైతుల పక్షపాతి అన్నారు. పంట నష్టం వివరాలను ముఖ్యమంత్రికి వివరించి, ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఏవో జైనుల్లాబ్దీన్, సర్పంచి శ్రీదేవి, అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు అమ్మన్నరాజా, రాజావెంకటాద్రి తదితరులు

జిల్లా కోర్టు ఆవరణలో స్వచ్ఛ భారత్

ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతలో భాగంగా శనివారం జిల్లా కోర్టు ఆవరణలో అదనపు జిల్లా జడ్జిలు డి.అమ్మన్నరాజా, టి.రాజావెంకటాద్రి ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. పిచ్చి మొక్కలు తొలగించి, చెత్త ఏరివేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు పి.లలిత, ఎస్.హేమలత, ఎన్.రాధిక, షేక్ ఇబ్రహీం షరీఫ్, పి.భానుసాయి, ఎస్. కోమలవల్లి, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చాకిరి సుధాకర్, న్యాయస్థానాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విజిలెన్స్ అధికారులమంటూ దందా

ఓర్వకల్లు న్యూస్‌టుడే: కేంద్ర విజిలెన్స్ అధికారులమంటూ ఐదుగురు వ్యక్తులు జాతీయ రహదారిపై ఇష్టానుసారంగా అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, కర్నూలు గ్రామీణ సీఐ చంద్రబాబునాయుడు శనివారం వివరాలు వెల్లడించారు. గిద్దలూరుకు చెందిన మధుసూదన్, ఆళ్లగడ్డకు చెందిన అంకిరెడ్డి, నంద్యాలకు చెందిన మహేశ్, పాణ్యం మండలం మద్దూరుకు చెందిన రవికుమార్, ఓర్వకల్లు మండలం ఉప్పలపాడుకు చెందిన ఆవుల మధులు కలిసి శుక్రవారం రాత్రి ఓర్వకల్లు మండలం నన్నూరు సమీపంలోని రాగమయూరికి చెందిన గంగాధర్ ఇంటికెళ్లి తాము కేంద్ర విజిలెన్స్ అధికారులమని చెప్పారు. బియ్యం వ్యాపారం చేస్తున్నావని.. అరెస్టు చేస్తున్నామని బెదిరించారు. అరెస్టు చేయకుండా విడిచి పెట్టాలంటే రూ.2.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గంగాధర్ నుంచి రూ.10 వేలు తీసుకుని మిగతా నగదు కోసం బేరమాడుతుండగా పోలీసులు అక్కడికి చేరుకోవటంతో పారిపోయారు. గంగాధర్ ఫిర్యాదు మేరకు ఎస్సై సునీల్‌కుమార్ కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశారు. గాలింపు చర్యల్లో భాగంగా హుసేనాపురం వద్ద శనివారం నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు వాహనాలు, 7 చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం తప్పనిసరి


విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థినులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ ఎ.భారతి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఆమె గిద్దలూరు నగర పంచాయతీలోని జడ్పీ బాలుర, బాలికల పాఠశాలలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించేందుకు పలు సూచనలు చేశారు. వంటశాల, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బంది, భోజన నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం ఆమె గిద్దలూరు సబ్‌జైలును పరిశీలించి ఖైదీలతో మాట్లాడారు. ఆర్థిక స్థోమత లేని ఖైదీలు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఖైదీలకు భోజనం తయారు చేసే సరకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.ఓంకార్, అదనపు కోర్టు న్యాయమూర్తి బి.మేరి సారా ధనమ్మ, సబ్ జైలు పర్యవేక్షకుడు లింగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు అనురాధ, నాగభూషణ్‌రెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

శీతల గోదాముల పన్ను సవరింపు

❖ గిద్దలూరు నగర పంచాయతీకి రూ.4.65 లక్షల ఆదాయం

ఈనాడు కథనానికి స్పందన

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: గిద్దలూరు నగర పంచాయతీలో పన్ను విధింపులో సిబ్బంది చేతివాటంపై ఈ నెల 16న 'ఈనాడు'లో 'పన్నుకు సున్నం... ఖజానాకు కన్నం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన నగర పంచాయతీ కమిషనర్ వెంకటదాసు రెవెన్యూ సిబ్బందిని పంపి గిద్దలూరు - ఒంగోలు రహదారిలోని శీతల గోదాముల విస్తీర్ణాలకు కొలతలు వేయించారు. ఇంటి పన్ను మదింపు చేసే సమయంలో అప్పటి రెవెన్యూ సిబ్బంది కొలతలు తక్కువగా చూపినట్లు గుర్తించారు. గతంలో ఏడాదికి గోదాముల నిర్వాహకులు కేవలం రూ.1.44 లక్షలు పన్ను చెల్లించేవారు. మళ్లీ కొలతలు తీయగా ఏడాదికి రూ.6.09 లక్షలు పన్ను పడింది. అంటే ఒక సంవత్సరానికి నగర పంచాయతీకి రూ.4.65 లక్షల ఆదాయం అదనంగా సమకూరింది. సచివాలయ కార్యదర్శులు తమ పరిధిలో తిరిగి సదరు అసెస్మెంట్లను గుర్తించి పన్ను విధించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.


మహబూబ్ సుభాని మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్

విధులకు వెళ్లొస్తూ కానిస్టేబుల్ దుర్మరణం


సుభాని (పాతచిత్రం)

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఒంగోలు-కర్నూలు రహదారిలో చీమకుర్తి మండలం చీమలమర్రి రెడ్డినగర్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్పెషల్ పార్టీలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దూదేకుల మహబూబ్ సుభాని (31) దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. .. మహబూబ్ సుభాని మార్కాపురంలో విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై ఒంగోలు వెళ్తుండగా చీమలమర్రి రెడ్డి నగర్ సమీపంలో ముందుగా వెళ్తున్న లారీ ఒక్కసారిగా వేగం తగ్గడం, ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో మోటార్ సైకిల్ అదుపు తప్పి సుభాని రహదారిపై పడిపోవడంతో తలకు బలమైన గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సీఐ సుబ్బారావు, ఎస్సై కృష్ణయ్యలు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కి తరలించారు. ఎస్పీ దామోదర్ ఆసుపత్రి వద్ద సుభాని మృతదేహానికి నివాళులర్పించారు. సుభానికి భార్య రసూల్‌బీ, రెండేళ్ల పాప ఉన్నారు. రసూల్‌బీ మళ్లీ ఇప్పుడు తొమ్మిది నెలల గర్భిణి. కుటుంబానికి ఆధారమైన సుభాని మృతికి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


నాగార్జున (పాతచిత్రం)

దొనకొండ, న్యూస్‌టుడే: మండలంలోని చందవరం సమీపంలోని పొలాల్లో విద్యుదాఘాతానికి గురై నాగార్జున (30) అనే యువకుడు మృతిచెందారు. విద్యుత్తు శాఖ ఏఈ నాగూర్ తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామంలోని విద్యుత్తు ఉపకేంద్రంలో వాచ్‌మేన్‌గా నాగార్జున పని చేస్తున్నారు. రైతులు తమ వ్యవసాయ పరివర్తకం ఫీజులు వేయాలని కోరగా.. వేయడానికి వెళ్లారు. ఇటీవల గాలులకు తీగ తెగిపడడం, దానికి ప్రమాదవ శాత్తు అతడి చెయ్యి తగిలి విద్యుదాఘాతానికి గురై మృతిచెందినట్లు చెప్పారు. అతడికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

పాఠశాల స్థలం ఆక్రమణకు యత్నం

పుల్లలచెరువు, న్యూస్‌టుడే: మండలంలోని చాపలమడుగులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తులు కర్రలు, పైపులు పాతి ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారని గ్రామస్థులు తెలిపారు. గతంలో కొందరు వ్యక్తులు ఆ స్థలంలో పలు వ్యాపార సముదాయలు, దుకాణాలు నడిపారు. గత ప్రభుత్వ హయాంలో వీటిని అక్కడినుంచి తొలగించారు. దుకాణాలు కోల్పోయిన వారికి మరో చోట స్థలం కూడా కేటాయించారు. పాఠశాల స్థలాన్ని తిరిగి ఎవరు ఆక్రమించుకోకుండా గోడ నిర్మించారు. గతంలో అక్కడ ఉన్న చిరువ్యాపారులు కోర్టును ఆశ్రయించగా అక్కడ ఎటువంటి కట్టడాలు జరగకుండా స్టే విధించినట్లు స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఎంఈవో సామ్యుల్ జాన్ ను వివరణ కోరగా.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

కేజీబీవీ కొలువులకు పోటాపోటీ

❖ 51 పోస్టులకు 1,930 దరఖాస్తులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులకు పోటీ తీవ్రంగా ఉంది. మొత్తం 51 పోస్టులకు 1,930 దరఖాస్తులొచ్చాయి. పదో తరగతి వరకు బోధించే సీఆర్‌టీ పోస్టులు 42 ఉండగా 1,331 మంది దరఖాస్తు చేశారు. ఇంటర్ విద్యార్థులకు బోధించే పీజీటీ పోస్టులు ఎనిమిదికి దాదాపు 400 మంది పోటీ పడుతున్నారు. ఇవి కాక బోధనేతర పోస్టులు వార్డెన్ ఒకటి, అకౌంటెంట్ భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. నియామక ప్రక్రియలో భాగంగా శనివారం సీఆర్‌టీ పోస్టులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సమగ్రశిక్షా కార్యాలయంలో ఈ కసరత్తు జరిగింది. 1:5 చొప్పున మెరిట్ ఆర్డర్‌లో అభ్యర్థులను పరిశీలనకు పిలిచారు. సోమవారం మిగిలిన పోస్టుల దరఖాస్తుల పరిశీలన జరగనుంది. అంతా పూర్తయ్యాక ఎంపిక చేసిన వారిలో రోస్టర్ కం మెరిట్ ప్రకారం తుది జాబితా ఖరారు చేస్తారు.


సీఆర్‌టీ పోస్టుల దరఖాస్తులు పరిశీలిస్తున్న సిబ్బంది

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 130, రిటైల్ లైవ్ - 152, చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్- 251

దుకాణాలు తొలగించరాదని ఆందోళన


ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

మార్కాపురం పట్టణం : మున్సిపల్ కార్యాలయం ముందు పట్టణంలోని చిరు వ్యాపారులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2006వ సంవత్సరంలో అప్పటి కలెక్టర్ డ్రైనేజీ కాలువలపై చిన్న చిన్న బంకులు పెట్టుకునేందుకు అనుమతి ఇచ్చారని, 25 సంవత్సరాలుగా చిరు వ్యాపారం చేసుకుంటూ మున్సిపాల్టీకి పన్ను చెల్లిస్తున్నామని చెప్పారు. ఇప్పుడు వాటి తొలగిస్తామని నోటీసులు ఇచ్చి తమకు అన్యాయం చేయొద్దని కోరుతూ మున్సిపల్ సిబ్బందికి వినతి పత్రాన్ని అందించారు.

మార్కాపురం

•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

మొండి వైఖరి తగదు


చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

మార్కాపురం పట్టణం: మున్సిపల్ కార్మికుల పట్ల అధికారులు మొండి వైఖరి విడనాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకెఎం.రఫీ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు శనివారం వారు నిరసన కార్యక్రమం నిర్వహించారు. కారణం లేకుండా మున్సిపాలిటీలో పనిచేస్తున్న 20మంది సిబ్బందిని తొలగించడం పట్ల వారు శనివారం చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


కొమరోలులో రహదారి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

కొమరోలు గ్రామీణం, కంభం, పెద్దదోర్నాల, పొదిలి గ్రామీణం, బేస్తవారపేట : అభివృద్ధికి సూచికలు రహదారులని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా కొమరోలు పంచాయతీలో రూ.80 లక్షల ఉపాధి నిధులతో నిర్మించనున్న సీసీ రహదారుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ● కంభం మండలంలోని తురిమెళ్ల, పెద్ద నల్లకాలువ గ్రామాల్లో రహదారుల నిర్మాణాలకు ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, ఎంపీడీవో వీరభద్రాచారి భూమి పూజ చేశారు. ● రాచర్ల మండలంలోని గుడిమెట్ల, గౌతవరం, అన్నంపల్లి, జేపీ చెరువు గ్రామాల్లో శనివారం సిమెంట్ రహదారుల నిర్మాణాలకు అధికారులు భూమి పూజ చేశారు. ●దోర్నాల మండలం నల్లగుంట్లలో రహదారి నిర్మాణ పనులను తెదేపా నాయకులు, అధికారులు ప్రారంభించారు. ● పొదిలి మండలంలోని మల్లవరం, కొష్టాలపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచి రెడ్డిబోయిన వెంకట సుబ్బయ్య భూమిపూజ చేశారు. ● బేస్తవారపేట మండలంలోని మోక్షగుండంలో రూ.27 లక్షలతో అంతర్గత సీసీ రహదారుల నిర్మాణానికి తెదేపా నాయకులు శంకుస్థాపన చేశారు.

వాగులా.. రహదారులా..!

● ఉరుములు.. మెరుపులతో వర్షం ● జలమయమైన లోతట్టు ప్రాంతాలు


అన్నసముద్రం రహదారిపై మోకాళ్ల లోతు ప్రవహిస్తున్న నీరు

త్రిపురాంతకం మండలంలోని కొత్త అన్నసముద్రం శివారులోని తారు రహదారిపై నీరు పొంగి ప్రవహిస్తోంది. దీంతో కొత్త, పాత అన్నసముద్రం గ్రామస్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆ ప్రాంతంలో రహదారి పల్లంగా ఉండటంతో ఆ దారికి ఇరువైపులా మాగాణి కావడంతో ఎగువ నుంచి వస్తున్న సాగర్ జలాలతో పాటు ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఆ నీరంతా తారు రోడ్డుపైకి చేరి మోకాళ్ల లోతు పారుతోంది. దీంతో రెండు గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ● పొదిలిలో శనివారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. వర్షానికి పలు చోట్ల లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు చేరింది. ఆకాశం మేఘావృతమై పట్టణమంతా చీకటిమయంగా మారింది. పొదిలి-గిద్దలూరు మార్గంలోని మార్కాపురం అడ్డరోడ్డు వద్ద నీరు ప్రధాన రహదారిపైకి చేరడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. ఆ ప్రాంతంలో సిమెంటు బ్రిక్స్ తయారీ కేంద్రంలోకి వర్షపునీరు చేరింది. అడ్డరోడ్డు వద్ద దెబ్బతిన్న తారు రోడ్డును మున్సిపల్ కమిషనరు పి.శ్రీనివాసరావు, ఆర్ అండ్ డీ డీఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.మారుతీరావులు పరిశీలించారు.

- న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం, పొదిలి

పొలానికి వెళ్లాలన్నా తప్పని పాట్లు


అధ్వానంగా మారిన రహదారి

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: ఈచిత్రంలో కనిపిస్తున్న రోడ్డు వీరభద్రాపురం నుంచి కొలుకుల వెళ్లేది. మూడు గ్రామాల ప్రజలు తమ పొలాలకు వెళ్లాలంటే ఈరోడ్డుగుండానే వెళ్లాలి. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ మట్టి రోడ్డు అడుగడుగునా గుంతలు ఏర్పడి వాహనాలు తిరిగేందుకు వీల్లేకుండా తయారైంది. ద్విచక్ర వాహనాలు వెళ్లాలంటే సాహసమే చేయాల్సిన పరిస్థితి. పంట ఉత్పత్తుల రవాణాకు కీలకమైన ఈరోడ్డును పాలకులు నిర్లక్ష్యం చేయడంతో మోకాళ్లలోతు గోతులు ఏర్పాడ్డాయి. గంగమ్మ ఆలయం నుంచి కొలుకుల వరకు మరీ అధ్వానంగా ఉంది.

పంటను కాపాడుకునేందుకు..


పొలంలోని నీటి తోడేందుకు ఏర్పాటు చేసిన ట్రాక్టర్ ఇంజిన్

పొదిలి గ్రామీణం, న్యూస్‌టుడే :సాధారణంగా వర్షాభావంతో ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు నీటిని పెట్టేందుకు రైతులు భగీరథయత్నం చేసేవారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో భారీ వర్షాలకు పంటచేలల్లో నిలిచిన నీటిని బయటకు తోడేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు అన్నదాతలు. పొదిలి మండలం అక్కచెరువు సమీపంలో ఓ రైతు ట్రాక్టర్ ఇంజిన్ ద్వారా తన పొగాకు పొలంలో అధికంగా నిలిచిన వర్షపు నీటిని బయటకు తోడేందుకు ప్రయత్నిస్తున్నారు. తొలగించేందుకు పలు విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు.

పురందేశ్వరిని కలిసిన భాజపా నాయకులు


పురందేశ్వరితో వై.పాలెం భాజపా నాయకులు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: యర్రగొండపాలెం భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఏనుముల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర భాజపా అధ్యక్షురాలు పురందేశ్వరిని విజయవాడ భాజపా కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గ సమస్యలను వివరించారు. నామినేటెడ్ పోస్టుల్లో భాజపా కోటాలో వై.పాలేనికి ఒకటి కేటాయించాలని ఆమెను కోరినట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర 20 సూత్రాల ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన లంకదినకర్‌ను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైపాలెం మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి పిచ్చయ్య, కోటిరెడ్డి, వీరారెడ్డి తదితులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించండి


ఖైదీతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం సబ్ జైల్లో రిమాండ్‌గా ఉన్న ఖైదిలకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి సబ్ జైలు అధికారులకు సూచనలు చేశారు. శనివారం మార్కాపురంలోని సబ్ జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి స్థానిక న్యాయమూర్తులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రిమాండ్‌లో ఉన్న ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని బైయిల్ అవకాశం ఉన్న వారికి బైయిల్ వచ్చే విధంగా కృషి చేస్తామని చెప్పారు. అనంతరం వీరికి పంపిణీ చేసే ఆహారంతో పాటు వారు ఉండే వసతిని పరిశీలించారు.

బేస్తవారపేట : బేస్తవారపేటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను గిద్దలూరు మండల న్యాయసేవాధికార సంస్థ న్యాయవాది చల్లగాలి పోలయ్య పరిశీలించారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలు ఉంటే 15100 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు.

ప్రతిభ చూపారు.. విజేతలుగా నిలిచారు


బహుమతులు అందజేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాలకు చెందిన ఎస్‌కె.షంషీర్(9వ తరగతి) ప్రథమ, కె.శ్రీనివాసులు(10వ తరగతి) ద్వితీయ, జి.జాన్ డేవిడ్(10వ తరగతి) తృతీయ బహుమతి గెలుచుకున్నారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, సమన్వయకర్త గోపిశెట్టి పవన్‌కుమార్, సిబ్బంది బహుమతులు అందజేశారు.


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పోటీ పరీక్షలతో సృజనకు పదును


విజేతలతో పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు సూర్యా విద్యానికేతన్ పాఠశాలలో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అన్న అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9 , 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్.భవ్యశ్రీ, పి.క్లారా జోన్స్, వి.సాయి మన్విత్ వరుస బహుమతులు దక్కించుకున్నారు. వారికి పాఠశాల కరస్పాండెంట్ దప్పిలి గురు బ్రహ్మానందరెడ్డి, పద్మ, సమన్వయ కర్త దండు ఓబయ్య చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
కంభం : 8008632343
పొదిలి : 8008550360

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే:



సమస్య : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలి, కోర్టుకూడలిలో ఆవులు రోడ్లపైనే అవి సంచరిస్తున్నాయి. రాకపోకలకు ఇబ్బంది ఉంది. వాహనచోదకులు గాయపడుతున్నారు. చర్యలు తీసుకోండి.

– పి.శేఖర్‌బాబు, పట్టణవాసి

సమాధానం: పోలీసు సిబ్బందితో కలసి సమన్వయం చేసుకొని పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నాం. ఆవుల యజమానులకు సైతం నోటీసులు జారీ చేస్తున్నాం. వినని పక్షంలో తగు చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోం.

– చెన్నకేశవులు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

● మార్కాపురం అగ్నిమాపకశాఖ అధికారి ఆర్.రామకృష్ణ

ముఖాముఖి



బాణ సంచా దుకాణాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని మార్కాపురం అగ్నిమాపకశాఖ అధికారి ఆర్.రామకృష్ణ పేర్కొన్నారు. దీపావళి పర్వదినం సందర్భంగా మార్కాపురంలో ఎస్వీకేపీ డిగ్రీ కళాశాలలో తాత్కాలిక బాణసంచా దుకాణాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దుకాణదారులు తీసుకోవాల్సి జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు వంటి అంశాలపై 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు.

- న్యూస్‌టుడే, మార్కాపురం

? : న్యూస్‌టుడే: ఎన్ని దుకాణాలకు ఇప్పటి వరకు అనుమతులు ఇచ్చారు? ఏర్పాటుకు నిబంధన లేమిటి?

✓: ఎస్ఎఫ్‌వో: ఈ నెల 15 నాటికి 23 దుకాణాలకు అనుమతులు ఇచ్చాం. ఇవి ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా ఫైర్, పోలీసు, మున్సిపల్ అధికారుల వద్ద నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) తీసుకోవాలి. ఆ తరువాత మీ సేవ కేంద్రంలో తాత్కాలిక దుకాణం ఏర్పాటుకు జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. అనుమతి ఉత్తర్వులు ఇక్కడి ఉప కలెక్టర్ కార్యాలయానికి వస్తుంది. వీటిని నిర్వాహకులు తీసుకోవాలి. ఎవరైనా అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసి దీపావళి మందులు విక్రయం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

?: దుకాణాల వద్ద ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

✓: విద్యుత్తు ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండే వస్తువులతో దుకాణం ఏర్పాటుకు వినియోగించాలి. రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి దుకాణానికి మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలి. 200 లీటర్ల సామర్థ్యం గల డ్రమ్ములో నీటిని నిల్వ చేసుకోవాలి. ఇసుకను కూడా అందుబాటులో పెట్టుకోవాలి. 18 ఏళ్ల లోపు ఉన్న పిల్లలను పనిలో పెట్టుకోకూడదు. పరిసరాల్లో ఎవరూ పొగ తాగకుండా చూసుకోవాలి. దీపాలు వెలిగించ కూడదు. వంట గ్యాస్‌కు సంబంధించిన లైటర్లు ఉండకూడదు. దుకాణం వద్ద తెలుగు, ఆంగ్లంలో అత్యవసర విభాగానికి సంబంధించిన చరవాణి నెంబర్లు ప్లకార్డులపై రాసి ఏర్పాటు చేయాలి

? : ఎన్ని రోజులు విక్రయాలు చేసుకోవచ్చు.?

✓: ఈనెల 29, 30, 31వ తేదీల్లో మాత్రమే ఎస్వీకేపీ డిగ్రీ కళాశాలలో విక్రయం చేసుకోవాలి. అంతకంటే ఎక్కువ రోజులు విక్రయిస్తే చర్యలు తప్పవు.

చెన్నకేశవస్వామికి వెండి వస్తువుల సమర్పణ


అర్చకులకు వెండి వస్తువులను అందజేస్తున్న శివరామకృష్ణ దంపతులు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రముఖ శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామికి రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ ఎం.శివరామకృష్ణ దంపతులు శనివారం రూ.లక్ష విలువ చేసే వెండి తట్టలను స్వామివారికి బహూకరించారు. వాటిని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులకు అందజేశారు.

గిరిజన గూడేల్లో ఉచిత వైద్యసేవలు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే : మండలంలోని పోతురాజు పెంట, బిళ్లగొండి, గౌతమబుద్దినికాలనీ లలో శనివారం వెంకటాద్రిపాలెం ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు కోటానాయక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఐటీడీఏ సంచార వాహనం ద్వారా వైద్యం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు టీకాలు వేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ పీహెచ్ మల్లిక, ఏఎన్ఎమ్ రమణ, ఆశా వర్కర్ లక్ష్మీదేవి, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

మెట్ల పై నుంచి జారిపడి వృద్ధురాలి మృతి

మార్కాపురం, న్యూస్‌టుడే: మెట్లపై జారిపడి చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండలంలోని గొట్టిపడియలో చోటు చేసుకుంది. మార్కాపురం గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బంగారు సుబ్బమ్మ (73) శుక్రవారం మిద్దె మెట్లు ఎక్కి పూలు కోస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడిపోయారు. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే కుటుంబ సభ్యులు మార్కాపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించి శనివారం మధ్యాహ్నం ఆమె మృతిచెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఎస్సై అంకమ్మరావు తెలిపారు.

జూదరుల అరెస్టు : మార్కాపురం : మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామ శివారులోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు మార్కాపురం గ్రామీణ పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.1450 నగదును స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కొనకనమిట్ల: కర్నూలు నిర్వహించిన రాష్ట్ర స్థాయి రబ్బీ పోటీల్లో గొట్లగట్టు పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి శనివారం తెలిపారు. అండర్ 17 విభాగంతో లక్ష్మి, మహేశ్వరీ, చంద్రలిఖత, గురులక్ష్మి, జస్సి పాల్గొని పతకాలు సాధించారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో లక్ష్మీ ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని పేర్కొన్నారు. డిసెంబరు 30న బీహార్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్ననుందని తెలిపారు.

వై.పాలెంలో 22న ఉద్యోగ మేళా

యర్రగొండపాలెం పట్టణం : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో యర్రగొండపాలెం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల్లో ఈ నెల 22న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్‌నాయుడు శనివారం తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రోత్సాహక నగదు అందజేత

పొదిలి, న్యూస్‌టుడే : లాల్ ఫౌండేషన్, ఆల్ మోమిన్ బీఈడీ కళాశాల వారి ఆధ్వర్యంలో పొదిలిలోని శ్రీవివేకానంద జూనియర్ కళాశాలలో ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ. 10,000 ప్రోత్సాహక బహుమతిని అందజేశారు దివంగత హాజీ ఎం.ఎ.ఖయ్యూం వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు చెక్కులను శనివారం అందజేశారు.

బాధ్యతల స్వీకరణ



పెద్దదోర్నాల : దోర్నాల ఇన్‌ఛార్జి విద్యుత్తు ఏఈగా ఎన్.హనుమాన్‌నాయక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. తర్లుపాడు ఏఈగా పనిచేస్తున్న ఆయన ఇక్కడికి ఇన్‌ఛార్జిగా వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏఈ నాగేంద్ర రెడ్డి మార్కాపురం గ్రామీణానికి బదిలీఅయ్యారు.

అక్రమ కట్టడాన్ని అడ్డుకోండి


రహదారిని ఆక్రమించి చేపడుతున్న ఇంటి నిర్మాణం

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం మండలంలోని పెద్దనాగులవరం గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు, డీలర్ ఓర్సు ఏడుకొండలు గ్రామంలోని బీసీకాలనీలోని రహదారిని ఆక్రమించి ఇల్లు నిర్మాణం చేపడుతున్నాడని.. తక్షణమే అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని గ్రామస్థులు శనివారం మార్కాపురం ఉప కలెక్టర్ సహధిత్ వెంకట త్రివినాగ్‌ను కలిసి విన్నవించారు. గ్రామానికి చెందిన తురక శ్రీను ఆధ్వర్యంలో గ్రామస్థులు అందరూ కలిసి ఉప కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించకుంటే ఇల్లు నిర్మాణం జరిగే అవకాశం ఉందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఇంటి నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరారు.

అర్బన్ కాలనీ.. నిండా సమస్యలే

కంభం, న్యూస్‌టుడే : ● ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు.. ● పట్టించుకోని అధికారులు

కాలనీ కష్టాలు

స్థానిక పంచాయతీ పరిధిలోని అర్బన్ కాలనీ వాసులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇళ్లలోకి నీరు చేరుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ సుమారు వెయ్యి కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. 3 వేలకు పైగా జనాభా నివాసం ఉంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో ఇళ్ల పరిసరాల్లో పక్కా కాలువలు ఏర్పాటు చేయకపోవడం, నీరు కిందికి వెళ్లే మార్గం లేకపోవడంతో ఇళ్లలోకి జలం చేరింది. దీంతో ఆ ప్రాంతంలో నివాసం ఉండే వారు వాన నీటిలో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. పలు చోట్ల ఇళ్ల పరిసరాల్లో మురుగు మడుగు కట్టి ఉంది. దాంతో దోమల బెడద అధికంగా ఉందంటున్నారు. సచివాలయం - 4 ఎదురుగా ఉన్న ఇంటి ముందు మడుగు కట్టి ఉంది.

అధ్వానంగా రహదారులు..

కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా గోతుల్లోకి నీరు చేరడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఇంజినీరింగ్ కార్యాలయం వైపు నుంచి వచ్చే మట్టి రోడ్లు బురదమయంగా ఉన్నాయి. కాలనీలోని పలు అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా చిత్తడిగామారుతున్నాయి. కాలనీ చివర సిమెంట్‌కు రోడ్డుపై గుంత ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. ఆ ప్రాంతంలోనే కుళాయిల వద్ద సరైన ప్లాట్‌ఫాం లేకపోవడంతో నీరు పట్టుకునేందుకు స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇళ్ల పరిసరాల్లో పిచ్చిమొక్కలు మొలిచి ఉన్నాయి. కాలనీలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ సిమెంట్ రహదారులు నిర్మించలేదు. మంచినీటి ట్యాంకుల వద్ద అపరిశుభ్రత నెలకొని ఉంది. వాటికి కుళాయిలు సరిగా లేవు. నీళ్లు పట్టుకునేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. సర్పంచితో మాట్లాడి ఇళ్ల మధ్య నిలిచి ఉన్న నీటిని బయటకు పంపించేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి తెలిపారు. కాలనీలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


ఇంటి ప్రాంగణంలో నిలిచిన నీరు

ఇబ్బందులు పడుతున్నాం



వానలకు నీళ్లు నిలిచి ఉన్నాయి. ఇంట్లోకి నీరు వస్తోంది. చీకటి పడితే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పురుగులు వస్తున్నాయి. ఇంట్లోకి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా నీటిలో నుంచి వెళ్లాల్సి వస్తోంది. కాళ్లు పాడైపోతున్నాయి. నాలుగు రోజుల నుంచి జలం నిలిచి ఉండడంతో దుర్వాసన వస్తోంది. చిన్నపిల్లలు, వృద్ధులం ఇంట్లో ఉన్నాం. ఇప్పటి వరకూ ఎవరూ పట్టించుకోలేదు. కనీసం నీళ్లు వెళ్లాలా చూడాలి.

– షేక్ జైనాబీ, అర్బన్ కాలనీ వాసి

నీటిని బయటకు పంపించాలి

కంభం(రాచర్ల), న్యూస్‌టుడే : వర్షాలకు పంటల్లో నిలిచిన నీటిని బయటకు పంపించాలని గిద్దలూరు ఉద్యాన శాఖ అధికారిణి విష్ణుప్రియ అన్నారు. రాచర్ల మండలం రామాపురం గ్రామంలోని మిరప పొలాలను శనివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పొలాల్లో తేమ ఆరడానికి 30 కిలోల యూరియా, 15 కేజీల పొటాష్ పైపాటుగా వేయాలని చెప్పారు. వాలిపోయిన మొక్కలను నిలబెట్టి మొదళ్ల చుట్టూ మట్టిని ఎగదోయాలని తెలిపారు. నీరు నిలిచి ఉండడంతో మొక్కలు పోషకాలను తీసుకోలేవని, యూరియా లీటర్ నీటికి అయిదు గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు.


రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యాన శాఖ అధికారిణి విష్ణుప్రియ

కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి

ఉత్సాహం నిండుగా... సృజన మెండుగా..

ఈనాడు ఆధ్వర్యంలో శనివారం కనిగిరి మండలంలోని కంచర్లవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, దర్శిలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల, సింగరాయకొండ మండలం మూలగుంటపాడు భాష్యం పాఠశాలల్లో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8,9,10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమకు ఎదురైన అనుభవాలను విశ్లేషించి నష్టాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన కంచర్లవారిపల్లి విద్యార్థులు నందిని, లక్ష్మి ప్రసన్న, మనోహర్‌లకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. దర్శిలో దీవెన, చిన్మయి, నిఖిల్‌సాయి ఆశ్రిత్ ప్రతిభ చూపి ప్రధానోపాధ్యాయులు ఖాదర్‌మస్తాన్, ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. మూలగుంటపాడులో ప్రతిభ చూపిన షేక్ అస్మిల్‌సుల్తానా, ప్రిన్సీ, ప్రియాసహస్రలకు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు ఉపాధ్యాయులు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు షేక్ రియాజ్, సాంబశివరావు, జడల శ్రీను తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, కనిగిరి, దర్శి, సింగరాయకొండ



సింగరాయకొండ: ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు


దర్శి: అందుకున్న ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



కనిగిరి: విజేతలకు బహుమతులందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

వైద్యశాలకు విరాళం

కనిగిరి: స్థానిక సామాజిక వైద్యశాల అభివృద్ధికి సీఎస్‌పురంకు చెందిన మన్నేపల్లి కార్తీక్ శనివారం కనిగిరిలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి కలిసి రూ. 25 వేలు విరాళం అందజేశారు. వైద్యశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు.

కాలువకు గండి.. రైతులే బాగు చేసుకున్నారండి..

సింగరాయకొండ గ్రామీణం: మండలంలోని ప్రధాన కాలువ అయిన పీబీ ఛానెల్‌కు గత అయిదేళ్లు కనీస మరమ్మతులకు నోచుకోక పోవడంతో ప్రస్తుతం పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వస్తున్న పెరిగి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. పీబీ ఛానెల్ ద్వారా బింగినపల్లి చెరువుకు నీరు చేరే క్రమంలో శనివారం గ్రామ సమీపంలో కాలువకు గండి పడి వర్షపు నీరు వృథాగా తరలిపోయింది. జలవనరుల శాఖ అధికారులకు స్థానికులు సమాచారమందించినా పట్టించుకోక పోవడంతో రైతులు ఇసుక బస్తాలతో గండి పూడ్చి నీటిని చెరువు మళ్లించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కాలువకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వ్యాపార కూడలి..
సమస్యల నిలయంగా మారి


ఎమ్మెస్సార్ రోడ్డులో రహదారిపైనే నిలిపిన వాహనాలు

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి రెవెన్యూ డివిజన్ కేంద్రానికి ఆర్థిక మూల బిందువులు పట్టణంలోని ఎమ్మెస్సార్ రోడ్డు, గార్లపేటరోడ్డు, కొట్లబజారు. హోటళ్లు, ఆసుపత్రులు, బ్యాంకులు, టీ, దుస్తులు, బంగారం, కూరగాయల దుకాణాలు అనేకం ఉన్నాయి. మొత్తం కనిగిరి పట్టణ వ్యాపార లావాదేవీలకు కేంద్రాలుగా పరిగణించే ఈ మూడు ప్రాంతాల్లో సమస్యలు తిష్ట వేశాయి.

మున్సిపాలిటీ: కనిగిరి
ప్రాంతాలు: ఎమ్మెస్సార్ రోడ్డు, కొట్ల బజారు, గార్లపేట రోడ్డు
దుకాణాలు: 1300
కుటుంబాలు: 1200
జనాభా: 7 వేలు
సమస్యలు: ట్రాఫిక్, ఆక్రమణలు, విద్యుత్ స్తంభాలు, మురుగు సమస్య, పశువులు


ఎమ్మెస్సార్ రోడ్డులో ప్రమాదకరంగా విద్యుత్తు పరివర్తకం

చక్రాలతో చిక్కులు..

ఈ వ్యాపార కూడళ్లలో ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకు ట్రాఫిక్‌తో సమస్యే. రాత్రివేళ, వేకువజామున అన్‌లోడింగ్ చేయాల్సిన భారీ వాహనాలు పట్టపగలే చేస్తుండటంతో నిత్యం గంటల తరబడి వాహనాలు రోడ్లపై చిక్కుకుపోతున్నాయి. మరోవైపు పార్కింగ్‌కు స్థలాలు లేకపోవడంతో దుకాణాలు, బ్యాంకులు, ఇతర పనుల మీద వచ్చిన వాహనదారులు నడిరోడ్డుపై వాహనాలు నిలుపుతున్నారు. ఇటీవల కాలంలో పోలీస్ శాఖ దుకాణానికి కొంత వసూలు చేసి పార్కింగ్ మార్కింగ్ వేసినా అది ఉపయోగం లేకుండా పోయింది. దాని వల్ల సమస్య మరింత జటిలమైందే తప్ప తగ్గలేదు. గత ప్రభుత్వం వ్యాపార కూడళ్లలో రోడ్ల విస్తరణ చేస్తామని చెప్పి విస్మరించింది. కేవలం సీసీ రోడ్ల నిర్మాణంతో సరిపెట్టింది. పైగా విద్యుత్తు స్తంభాలను తొలగించకుండా అలాగే వేయడంతో అవస్థలు రెట్టింపయ్యాయి. 25 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాలు కావడంతో కొన్ని సందర్భాల్లో షాక్ కొడుతున్నట్లు స్థానికులు తెలిపారు.

రోడ్డుపై మురుగు..

ఆయా ప్రాంతాల్లో మురుగు కాలువ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. చాలావరకు శిథిలమై పోవడంతో మురుగు నీరు రోడ్డు మీద పారుతోంది. ఇక దుకాణదారులు వ్యర్థాలను చెత్తబుట్టలో వేయకుండా నడిరోడ్లపై వేస్తున్నారు. ఆవులు, పందులు రోడ్లపై సంచరిస్తూ ఆ చెత్తను చిద్రం చేస్తూ పరిసరాలను అధ్వానంగా మారుస్తున్నాయి. గార్లపేట బస్టాండ్, ఎమ్మెస్సార్ రోడ్డులలో విద్యుత్తు పరివర్తకాలు కిందకు వేలాడుతూ అత్యంత ప్రమాదకరంగా మారాయి. వ్యాపార సముదాయాలైన ఈ ప్రాంతాల్లోని సమస్యలను గుర్తించి పరిష్కారానికి చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయమై కమిషనర్ డానియేల్ జోసెఫ్ వివరణ కోరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.


కొట్ల బజారులో నడి రోడ్డులో నిలిపిన లారీ

దర్శి ఉపకారాగారం తనిఖీ

దర్శి, న్యూస్‌టుడే: దర్శి ఉప కారాగారాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించటంతో పాటు ఖైదీలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలను ఉద్దేశించి చట్టాలు, న్యాయ సేవల గురించి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దర్శి సీనియర్ సివిల్ న్యాయమూర్తి శివశంకర్‌రెడ్డి, జూనియర్ సివిల్ న్యాయమూర్తి ప్రత్యూష, జైలర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు. ● దర్శి కోర్టు సీనియర్ సివిల్ న్యాయమూర్తి శివశంకర్‌రెడ్డి దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో రమాదేవి, ప్రధానోపాధ్యాయులు కాకర్లపాటి తదితరులు పాల్గొన్నారు. ● కనిగిరి: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర సూచించారు. పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు శుభ్రమైన ఆహారం అందించాలన్నారు. పాఠశాలలో ఏలాంటి సమస్య తలెత్తినా వెంటనే మండల న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు.


దర్శి: అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

విద్యుత్తు అధికారుల దాడులు

కొండపి గ్రామీణం, కనిగిరి: విద్యుత్తు చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్తు ఏఈ కుంచాల కోటయ్య హెచ్చరించారు. మండలంలో ఆ శాఖ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. అక్రమ విద్యుత్తు వినియోగంపై 93 కేసులకు నమోదు చేసి, రూ. 3,11,600 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కందుకూరు ఏఈ మల్లెల నాగమల్లేశ్వరరావు, సబ్ డివిజన్ అధికారులు యుగంధర్ పాల్గొన్నారు. ● కనిగిరి పట్టణంలో విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలో 25 బృందాలు శనివారం తనిఖీలు నిర్వహించారు. విద్యుత్తు చౌర్యం, అదనపు లోడు కేసులకు సంబంధించి మొత్తం 45 కేసులు నమోదు చేసి రూ. 1.95 లక్షల అపరాధ రుసుం విధించినట్లు జిల్లా విజిలెన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు టి.హైమావతి తెలిపారు.

న్యాయం చేయాలంటూ మంత్రికి వినతి

తాళ్లూరు, న్యూస్‌టుడే: తమకు న్యాయం చేయాలంటూ కొందరు మొక్కజొన్న రైతులు శనివారం సాయంత్రం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని కోరారు. మండలంలోని రామభద్రాపురం, మాధవరం వద్ద పంట నష్టాలను పరిశీలిస్తున్న సందర్భంలో కొందరు రైతులు మంత్రిని కలిసి సమస్యను విన్నవించుకున్నారు. కొందరు వ్యాపారులు తమకు నకిలీ విత్తనాలను అంటగట్టి నట్టేట ముంచారని వారు గోడు వెళ్లబోసుకున్నారు. ప్రభుత్వం తరుపున ఆదుకోవాలని కోరారు. విత్తనాల కొనుగోలుకు సంబంధించి బిల్లులు ఉన్నాయా, లేవా అన్న విషయమై మంత్రి విచారించారు. అయితే అధికారుల నుంచి నివేదికలు వచ్చిన తదుపరి విత్తనాల్లో తేడా ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటానని మంత్రి స్వామి చెప్పారు. ప్రభుత్వం తరపున ఏదేని సాయం చేసేందుకు వీలుందా, లేదాన్న విషయమై పరిశీలిస్తామని, వీలుంటే తగిన విధంగా ఆదుకుంటామన్నారు.


సమస్యను మంత్రికి విన్నవిస్తున్న రైతు రామయ్య

చినుకు పడితే చిత్తడే

హెచ్‌ఎంపాడు మండలంలోని అంతర్గత రహదారులు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడం లేదు. చినుకు పడితే రహదారులు చిత్తడవుతున్నాయి. ఇటీవలె కురిసిన వర్షానికి ఈ దారుల్లో కనీసం నడిచేందుకు సైతం వీలులేకుండా పోయాయి. హెచ్‌ఎంపాడు, వేములపాడు బస్‌స్టాండ్ వెళ్లే దారులు అధ్వాన్నంగా తయారైంది. కనిగిరి - కంభం రహదారి రెండు వరుస పనులు రెండేళ్లుగా నిలచి చప్టాలు, డివైడర్ల వద్ద వాహనాలు జారిపోతున్నాయి. కొత్తూరు, హాజీపురం, ఉమ్మనపల్లి, ఉసుళ్లపల్లి, ఆవులవారిపల్లి, మల్లవరం, దాసరిపల్లి ఎస్సీకాలనీ రహదారి కిష్టంపల్లి రహదారి, దొడ్డిచింతల అధ్వానంగా మారడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఏటా పంచాయతీశాఖ అధికారులు మరమ్మతుల ప్రతిపాదనలకే పరిమితమవుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, హనుమంతునిపాడు


కనిగిరి–కంభం రహదారి ఇలా..


కనిగిరి: కంది చేనులో చేరిన వర్షపు నీరు


ముండ్లమూరు: మక్కెనవారిపాలెంలో ఇలా..

వీడని వర్షం.. తీరని నష్టం..

కనిగిరి, ముండ్లమూరు, కురిచేడు, సింగరాయకొండ, హనుమంతునిపాడు: కనిగిరి, ముండ్లమూరు, కురిచేడు, సింగరాయకొండ హెచ్‌ఎంపాడు తదితర మండల్లాలో శనివారం కురిసిన వర్షానికి పంటలన్నీ నీటమునిగాయి. ముండ్లమూరు మండలంలోని మారెళ్ల, జమ్మలమడక, ముండ్లమూరు, మక్కెనవారిపాలెం, పూరిమెట్ల, ఉమామహేశ్వరపురం తదితర గ్రామాల్లో రోడ్లు బురద మయంగా మారాయి. కురిచేడు మండలంలో కాటంవారిపల్లె, కురిచేడు, గొల్లపాలెం, పొట్లపాడు, పడమర నాయుడుపాలెం, నమశ్శివాయపురం పెద్దవరం, దేకనకొండ గ్రామాల్లో పంటలు అధికంగా నీట మునిగాయి. కనిగిరి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో కంది చేలు ఉరకెత్తాయి. వర్షపు నీరు చేరి బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో పంట మొదళ్లు కుళ్లి పోయే అవకాశం ఉందని అన్నదాతలు వాపోతున్నారు. హనుమంతునిపాడు మండలంలో ఏనుగుమందవాగు, ఎర్రవాగు, నాగులేరు ఉద్ధృతంగా ప్రవహించాయి. వ్యవసాయశాఖ ఏవో రమణ ఆధ్వర్యంలో దెబ్బతిన్న పైర్లను శనివారం పరిశీలించి రైతులకు సూచనలు చేశారు.

ఈదురుగాలులకు ఇంటిపై రేకులు ధ్వంసం

మర్రిపూడి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలో అయిదురోజులుగా వర్షం కురుస్తుంది. శనివారం ఉదయం ఈదురుగాలులతో కూడిన వానకు మండలంలోని జువ్విగుంటకు చెందిన ఓ ఇంటిపై రేకులు ధ్వంసమై గోడలు పడిపోయాయి. దీంతో ఇంటిలోని గృహోపకరణాలు తడిచిపోవటంతో సుమారు రూ. లక్ష మేర నష్టం జరిగిందని ఇంటి యాజమాని పసుపులేటి బ్రహ్మానందం వాపోయారు. సమాచారం అందుకున్న కార్యదర్శి హరికృష్ణ, సర్వేయర్ కొండారెడ్డి ఇంటిని పరిశీలించారు. సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.


రేకులు పడిపోయిన ఇళ్లు

జూద శిబిరంపై దాడి

మర్రిపూడి, న్యూస్‌టుడే: మండలంలోని చిమటలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 72,170 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

డీఈ ఆదిశేషు మృతికి సంతాపం

దర్శి, న్యూస్‌టుడే: దర్శి పంచాయతీరాజ్ డీఈ ఆదిశేషు గుండెపోటుతో మరణించటం బాధాకరం అని ఆయన ఆత్మకు శాంతి కలగాలని తెదేపా నాయకులు డా. లలిత్‌సాగర్ అన్నారు. గుంటూరులో డీఈ నివాసంలో శనివారం ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు.

టమోటా లోడు వ్యాన్ బోల్తా

టంగుటూరు, న్యూస్‌టుడే: టమోటా లోడుతో వెళ్తున్న వాహనం శుక్రవారం అర్ధరాత్రి అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన టంగుటూరు 16వ జాతీయ రహదారి ప్రియాంక కాటా ఎదురుగా చోటు చేసుకుంది. హైవే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా మదనపల్లె నుంచి ఒంగోలుకు మినీ వ్యాన్‌పై టమోటాలు తీసుకువస్తుండగా టంగుటూరు జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా పడింది. ఈ క్రమంలో వాహనంలో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. టమోటాలు జాతీయ రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వాహనాలను సర్వీసు రోడ్డుకు తరలించారు. బోల్తాపడిన మినీ వ్యాన్‌ను క్రేన్ సాయంతో పైకి లేపారు. రోడ్డుపాలైన టమోటాలను ఏరి రైతులు మరో వాహనంపై ఒంగోలు మార్కెట్‌కు తరలించారు.


రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన టమోటాలను ఏరుతున్న రైతులు

పల్లె ప్రగతికి ప్రభుత్వం ప్రాధాన్యం

ముండ్లమూరు, దర్శి, తాళ్లూరు, టంగుటూరు, పొమూరు, న్యూస్‌టుడే: పంచాయతీల ప్రగతికి కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మీ తెలిపారు. పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని శంకరాపురం, నూజెళ్లపల్లి, మారెళ్ల, జమ్మలమడక, పూరిమెట్ల గ్రామాల్లో సీసీ రోడ్లు, పక్కా కాలువల నిర్మాణానికి ఆమె నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మండలపు వెంకట్రావు, సర్పంచి కూరపాటి మల్లేశ్వరినారాయణస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● దర్శి మండలంలోని త్రిపురసుందరీపురంలో సీసీ రోడ్డు, పక్కా కాలువల నిర్మాణానికి శనివారం ఎంపీడీవో కృష్ణమూర్తితో కనిగిరి డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డిలు భూమి పూజ చేశారు. ● తాళ్లూరు మండలంలోని కొర్రపాటివారిపాలెంలో మూడు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శనివారం సర్పంచి కొర్రపాటి శ్రీదేవి శంకుస్థాపన చేశారు. ● టంగుటూరు మండలకేంద్రంతోపాటు సూరారెడ్డి గ్రామంలో అధికారులు నాయకులు పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు.

● పొమూరులోని విరాట్‌నగర్ అంకాళమ్మ వీధి, తదితర చోట్ల రూ. 5కోట్ల, ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి భూమి పూజచేశారు.


ముండ్లమూరు: శంకరాపురంలో భూమి పూజ చేస్తున్న తెదేపా నాయకురాలు గొట్టిపాటి లక్ష్మీ

ఉపాధి కల్పనకు కృషి


నిమ్జ్ భూములు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, విశ్రాంత కర్నల్ జయరావు

పొమూరు, సీఎస్‌పురం, న్యూస్‌టుడే: యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, విశ్రాంత కర్నల్ జయరావులు పేర్కొన్నారు. మండంలోని మార్కొండాపురం సమీపంలో నిమ్జ్ భూములను డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు కోసం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో రక్షణ రంగానికి సంబంధించిన సాంకేతికతను అభివృద్ధి చేసి ఈ ప్రాంత యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు.

● పవిత్ర పుణ్యక్షేత్రమైన భైరవకోనలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివిశివరాం, విశ్రాంత కర్నల్ జయరావులు శనివారం సందర్శించి పూజలు నిర్వహించారు. వారు జలపాతాన్ని వీక్షించి, కాలభైరవేశ్వర స్వామిని, త్రిముఖ దుర్గాంబ, శివలింగాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పొలాల్లో సరికొత్త సాగు

■ విస్తృతంగా పొలం పిలుస్తోంది కార్యక్రమం

పొమూరు, న్యూస్‌టుడే:

వైకాపా పాలనలో కీలకమైన వ్యవసాయ శాఖ కార్యక్రమాలు గాడి తప్పాయి. అన్నదాతలకు సాగులో మెలకువలు తెలిపేందుకు నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలు సైతం మొక్కుబడి తంతుగా మార్చేశారు. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వ్యవసాయ కార్యక్రమాలను చక్కదిద్దే చర్యలు చేపట్టింది. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను రైతుల చెంతకు పంపి వారికి సాగులో సలహాలు, సూచనలు అందిస్తే మేలు జరుగుతుందని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ప్రారంభించింది. అందులో భాగంగా అధికారులు సాగు విషయాలపై అవగాహన కల్పించడమే కాక పొలాలను పరిశీలించి లోటు పాట్లు గుర్తించనున్నారు. రైతులు చేపట్టాల్సిన చర్యలను అప్పటికప్పుడే వివరించి వారిని అప్రమత్తం చేస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గం పరిధిలో 50వేల ఎకరాల్లో రైతులు పంటను సాగు చేశారు. గత నెల సెప్టెంబర్ 24 తేదీన నుంచి వారానికి రెండు రోజులు ఈ కార్యక్రమాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలను పరిశీలిస్తున్నారు. వాతావరణ మార్పులు, ఎదురయ్యే చీడపీడల గురించి, విత్తన శుద్ధి, భూసార పరీక్షలు, ఎరువుల వాడకం, దిగుబడులు, పెట్టుబడుల ఖర్చు తగ్గించే తదితర వాటిపై రైతులకు సూచనలు ఇచ్చి వారిని చైతన్య పరుస్తున్నారు.


సీఎస్‌పురం మండలం పెదగోగులపల్లిలో కంది పంటను పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటరమణ

అన్నదాతలకు ఎంతో ఉపయుక్తం

పొలం పిలుస్తోంది కార్యక్రమం అన్నదాతలకు ఎంతగానో ఉపయుక్తం. రైతులు సాగుచేస్తున్న పంటలకు వ్యాపించే తెగుళ్లు, వాటి సస్యరక్షణకు చేపట్టాల్సిన చర్యలతో పాటు ఇతర విషయాలపై అవగాహన కల్పిస్తున్నాం. అన్నదాతలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి.
– ఎగ్గోని వెంకటరమణ, ఏడీఏ, కనిగిరి

సలహాలు ఇవ్వడం బాగుంది..



ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు రైతుల వద్దకు వచ్చి సలహాలు ఇవ్వడం ఆనందంగా ఉంది. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తెగుళ్ల నివారణకు ఎరువులు, పురుగు మందులు ఎంతెంత వాడాలో చెబుతున్నారు. అలాగే వివిధ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు.
– శ్యామల తిరుపతిరెడ్డి, కె.అగ్రహారం, రైతు

అవగాహన కల్పిస్తున్నారు..



సాగు పరమైన అన్ని విషయాలపై రైతులకు పరిజ్ఞానం ఉండదు. ఈ విషయాలపై అవగాహన కల్పించడం ఎంతో బాగుంది. పొలంలో పంట పరిస్థితిని చూసి ఎటువంటి చర్యలు తీసుకోవాలో చెప్పడంతో రైతు సైతం ధైర్యంగా సాగు సన్నద్ధమవుతాడు.
– చీర్లదిన్నె మాలకొండయ్య, చింతలపాలెం, రైతు

పిచ్చి మొక్కల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్తపేటలో నెలకొన్న సమస్యలపై ఈ నెల 18న 'దాహం కేకలు.. విద్యుత్తు సమస్యలు' శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో పరాశర భారతి ప్రాథమిక పాఠశాల సమీపంలో బోర్, కుళాయి వద్ద పిచ్చి మొక్కలను తొలగించారు. రోడ్లపై ఉన్న చెత్తాచెదారాన్ని ఎత్తి వేయించారు.

రెయిన్ కోట్ల పంపిణీ

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి మున్సిపాలిటీలో విధులు నిర్వహించే మున్సిపల్ కార్మికులకు కమిషనర్ డానియెల్ జోసెఫ్ శనివారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ, వాన లేకచేయకుండా పురపాలిక పరిశుభ్రతకు పాటు పడే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా వీటిని అందిస్తున్నట్లు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

రాయచోటి: అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం లక్ష్మీపురంలో ఈ ఏడాది జూన్ 30న జరిగిన చోరీ కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. రాయచోటి పట్టణ పోలీసు స్టేషన్‌లో శనివారం డీఎస్పీ వివరాలు వెల్లడించారు. లక్ష్మీపురంలో జరిగిన వరుస చోరీలపై అప్పట్లో కేసు నమోదు చేసి దొంగల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం గాలివీడు రింగ్‌రోడ్డు వద్ద సంచరిస్తున్న నెల్లూరు పట్టణానికి చెందిన లింగుటేరి రాంబాబు, కావలికి చెందిన నడింపల్లి గోపీలను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ. ఆరు లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పట్టుబడిన వారిపై నెల్లూరు, కావలి, కనిగిరి, వేదాయపాలెం, యలమంచిలి, పత్తిపాడు, సింగరాయకొండ, పొదిలి, పొమూరు ప్రాంతాల్లో చోరీ కేసులు నమోదై ఉన్నాయని స్పష్టం చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు.

లారీ డ్రైవర్ అజాగ్రత్తకు మహిళ బలి

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోటలో లారీడ్రైవర్ అజాగ్రత్త వల్ల చీరాల సంతమ్మ (55) శనివారం మృతిచెందారు. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంతమ్మ ఆరోగ్యం బాగాలేకపోవడంతో సమీపంలో ఉన్న ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా మాచర్ల నుంచి సిమెంటు లోడుతో వస్తున్న లారీ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో ఆమెపైనుంచి లారీ వెళ్లింది. వెంటనే 108లో మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. కొన్ని సంవత్సరాల క్రితం భర్త ఆమెను విడిచి పెట్టాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

రేపటి నుంచి అంతర కళాశాలల క్రీడా పోటీలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పరిధిలో అంతర కళాశాలల క్రీడా పోటీలు ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్నట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఎ.దేవివరప్రసాద్ తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో వీసీ డీవీఆర్ మూర్తి పాల్గొంటారన్నారు. గుర్తింపు పొందిన 224 కళాశాలల విద్యార్థులకు బ్యాడ్మింటన్, షటిల్... సింగిల్స్, డబుల్స్ (పురుషుల) పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్వహణ కార్యదర్శిగా బండ్ల బాపయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.ఆదిలక్ష్మి వ్యవహరిస్తారన్నారు.

22 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ఒంగోలు గ్రామీణం: ఈ నెల 22 నుంచి 25 వరకు ఒంగోలు మండలంలోని గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్ తెలిపారు. 22న ఉలిచి, 23న కరవది, 24న [illegible], 25న చేజర్ల గ్రామ సచివాలయాల్లో ఈ శిబిరాలు ఉంటాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

యూహెచ్‌సీ సిబ్బంది కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో (యూహెచ్‌సీ) ఒప్పంద పద్ధతిపై పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సంఘం అధ్యక్షుడు కె.హనుమంతరావు కోరారు. సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్టాఫ్ నర్సు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉద్యోగులను రెగ్యులర్ చేసేవరకు టైం స్కేల్ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హనుమంతరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సురేంద్ర, కోశాధికారిగా కె.కాజావలి, నిర్వహణ అధ్యక్షుడిగా ఎ.సుధాకర్, ఉపాధ్యక్షులుగా నిర్మలకుమారి, వాసవి, అంజనేయులు, కార్యదర్శులుగా జి.శ్రీనివాసరావు, సుబానీ, రమారావు, ఎ.అంజనేయులు ఎన్నికయ్యారు.



బస్టాండు కూడలిలో పరిస్థితి

అంతలోనే ఎంత మార్పు!

• నగరంలో భారీ వర్షం... యంత్రాంగం చర్యలతో తప్పిన ముప్పు



నిలిచిన నీటిలో రోడ్డు దాటేందుకు అవస్థలు

అప్పుడు...

ఓ మోస్తరు వాన పడినా నగరంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యేవి. ఇక భారీ వర్షం పడితే గంటల తరబడి ట్రాఫిక్ నిలిచి చిక్కులు తప్పేవి కావు. లోతట్టు ప్రాంతాలు, శివారు కాలనీల సంగతి సరేసరి. ఇళ్లలోకి నీరు చేరి బయట ఎక్కడో తలదాచుకోవాల్సి వచ్చేది. 2022 అక్టోబరులో కురిసిన వర్షాలకైతే నగరవాసులు అల్లాడిపోయారు. ముంపుకాలనీల వారు తేరుకునేందుకు వారం రోజులకు పైగా సమయం పట్టింది. గత పాలకులు అయిదేళ్లుగా మురుగు పారుదల వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం... కీలకమైన పోతురాజు, కాలువల ఆధునికీకరణ గాలికొదిలేయడమే ఇందుకు ప్రధాన కారణం. ముంపు ముప్పు తలెత్తినప్పుడు కూడా ప్రజా ప్రతినిధులు, యంత్రాంగం మధ్య సమన్వయం కొరవడి పైపై చర్యలకే పరిమితం కావడం... సమస్య తీవ్రతను మరింత పెంచింది.

ఇప్పుడు...

గత అయిదు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు పడుతున్నాయి. శనివారం ఉదయమైతే రెండు గంటల పాటు దంచికొట్టింది. వాస్తవానికి ఈ వానలకు నగరం అతలాకుతలమవ్వాల్సిందే. భాగ్యనగర్‌లోని నాలుగు అయిదు లైన్లు, హౌసింగ్ బోర్డు కాలనీ, ప్రగతినగర్, సంతపేట, రామనగర్, కొత్త కూరగాయల మార్కెట్, బాపూజీ కాంప్లెక్స్ ప్రాంతాలతో పాటు... వడ్డెవాని కుంట, జడ్పీకాలనీ, మదర్ థెరెసా కాలనీ, బాలినేని కాలనీ, మోటారు ఉదయం కాలనీ, బలరాం కాలనీ, భరత్‌నగర్, నెహ్రూనగర్ ఎక్స్‌టెన్షన్ తదితర కాలనీలు ముంపులో చిక్కుకుని విలవిల్లాడాల్సిందే. కానీ... యంత్రాంగం సమష్టిగా పనిచేసి యుద్ధప్రాతిపదికన కాలువల బాగుకు చర్యలు తీసుకోవడంతో ముప్పు తప్పింది.

వర్షం పడిన ప్రతిసారీ సమస్య తలెత్తుతున్నందున ఇటు అంతర్గత మురుగు పారుదల వ్యవస్థ... అటు కీలకమైన పోతురాజు, నల్లకాలువలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నగరవాసులు కోరుతున్నారు.

తక్షణ స్పందనతో ఉపశమనం...

• కర్నూలు రోడ్డుకు ఇరువైపులా ప్రధాన కాలువలను మూసేసి నిర్మాణాలు చేపట్టడంతో సమస్య తలెత్తుతున్నందున... జేసీబీ సాయంతో ఆయా నిర్మాణాలను తొలగించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, మట్టితో పూడిపోయిన కాలువలను బాగు చేశారు. ఇటు బస్టాండ్ కూడలి నుంచి పాత మార్కెట్ వరకు, అటు డీమార్ట్ ఎదుట ఈ పనులు చేపట్టారు. దీంతో ప్రధాన మార్గాల్లో ఎక్కువ సేపు నీరు నిలవలేదు. • భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, ప్రగతినగర్, సంతపేట, రామనగర్ ప్రాంతాల్లో నిలిచిన నీరు సాఫీగా సాగేలా ఆస్టర్ రమేష్ ఆసుపత్రి పక్కగా వెళ్లే మొండి కాలువను బాగు చేశారు. బైపాసకు అటు వైపు ఉన్న వడ్డెవానికుంట, జడ్పీ కాలనీ, మదర్ థెరెసా కాలనీ, బాలినేనికాలనీ పరిసర ప్రాంతాల్లో వరద నిలవకుండా ఆర్టీవో కార్యాలయం పక్క కాలువను మెరుగు పరిచారు. • ఈ రెండూ అనుసంధానమై ఉన్న నల్లకాలువ ఇప్పటికే [illegible], జమ్ముతో మూసుకుపోవడంతో... వాటిని తొలగించి మురుగు ప్రవాహానికి ఇబ్బంది లేకుండా దారి చేశారు. దీంతో ముంపు ముప్పు నుంచి నగరవాసులకు సత్వర ఉపశమనం లభించింది. ప్రజా ప్రతినిధులతో పాటు నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పనులను పర్యవేక్షించారు.

– ఈనాడు, ఒంగోలు



ఆస్టర్ రమేష్ ఆసుపత్రి ఎదుట బాగు చేసిన కాలువ



బాపూజీ మార్కెట్ ఎదుట కాలువలపై ర్యాంపుల తొలగింపు



నాడు: ఒంగోలు ట్రిపుల్ ఐటీ పక్కన నల్లవాగు దుస్థితి



నేడు: వర్షాల వల్ల ముప్పు తలెత్తకుండా వరద పోయేందుకు వీలుగా పొక్లెయిన్‌తో దారి చూపారిలా...



నాలుగు రోజుల క్రితం పరిస్థితి...

వాహనదారులకు ఊరట

ఒంగోలు - కర్నూలు రహదారిలో చీమకుర్తి మండలం యల్లయ్యనగర్ ప్రాంతంలో వాహనదారుల కష్టాలకు తాత్కాలిక ఉపశమనం లభించింది. గత ప్రభుత్వం రోడ్ల నిర్వహణను పూర్తిగా విస్మరించడంతో ఇక్కడ భారీ గోతులు ఏర్పడ్డాయి. వర్షాలకు వాటిలో నీరు చేరి తటాకంలా మారడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. సమస్య తీవ్రతను తెలియజెబుతూ 'ఈనాడు - ఈటీవీ'లో కథనాలు రావడంతో గనులు భూగర్భ, రెవెన్యూ ఆర్అండ్‌బీ శాఖల అధికారులు స్పందించారు. అక్కడి కంకర మిల్లులు, గ్రానైట్ పరిశ్రమల వారి సహకారంతో గుంతలను వెట్‌మిక్స్‌తో పూడ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఆయా సంస్థలు సహకారం అందిస్తే పూర్తిస్థాయిలో రోడ్డు బాగుపడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

– న్యూస్‌టుడే, చీమకుర్తి



అధికారుల చొరవతో నేడు ఇలా...

నిర్మాణాల తొలగింపుపై నిరసన

ఒంగోలు గ్రామీణం, అర్బన్– న్యూస్‌టుడే: కర్నూలురోడ్డులోని పొగాకు వేలం కేంద్రం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు ఏపీఐఐసీ స్థలంలో ఉన్న నిర్మాణాలను తొలగించడాన్ని ఖండిస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శనివారం నిరసన చేపట్టారు. నియోజకవర్గ కన్వీనర్ కె.వెంకటరావు మాట్లాడుతూ... ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఆక్రమణల పేరిట ఇళ్లను తొలగించడం సరికాదన్నారు. బాధిత కుటుంబాలకు తక్షణం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నూకతోటి పిచ్చమ్మ, ఎ.రత్తమ్మ, నజీర్, ఫాతిమా పాల్గొన్నారు. * డెయిరీ ఎదుట తొలగించిన షెడ్లను కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ శనివారం పరిశీలించారు. కనీస సమాచారం లేకుండా తొలగించడం సరికాదన్నారు. వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధుల దృష్టికి సమస్య తీసుకెళ్లి న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

టి.కృష్ణ వర్ధంతి సభ వాయిదా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సినీ దర్శకుడు టి.కృష్ణ వర్ధంతి సందర్భంగా ఒంగోలులో ఆదివారం నిర్వహించాల్సిన పాటల పోటీలు, సభా కార్యక్రమాలను... వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు కమిటీ సభ్యుడు ఉప్పుటూరి ప్రకాశరావు తెలిపారు. ఎప్పుడు నిర్వహించేదీ త్వరలోనే తెలియజేస్తామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంపీ మాగుంటతో గనులశాఖ డీడీ భేటీ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని... జిల్లా గనులశాఖ డీడీ రాజశేఖర్ రామనగర్‌లోని కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సహాయ జియాలజిస్ట్ వర్మ, సాంకేతిక సహాయకుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయ దరఖాస్తుల గడువు పెంపు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయించే వ్యాపార అనుమతులకు దరఖాస్తుల గడువును ఈ నెల 22 వరకు పొడిగించినట్లు డీఆర్వో శ్రీలత తెలిపారు. ఈ నెల 29 నుంచి 31 వరకు అమ్మకాలకు అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగలవారు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.



వ్యాస రచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు...



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ ప్రకాష్‌బాబు, ఉపాధ్యాయులు

ప్రతిభ చాటారు... బహుమతులు గెలిచారు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వ్యాసరచన పోటీలు ఉత్సాహంగా సాగాయి. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అన్న అంశంపై... 8, 9, 10 తరగతుల పిల్లలకు మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో వీటిని నిర్వహించారు. అంతర్జాలం వల్ల కలుగుతున్న ప్రయోజనాలు... దుర్వినియోగం వల్ల తలెత్తే దుష్పరిణామాలను విద్యార్థులు చక్కగా వివరించారు. పదో తరగతి విద్యార్థిని కె.హాసిని వనజవల్లి... ప్రథమ; 9వ తరగతికి చెందిన రావెండ్ల తాప్సి... ద్వితీయ; 8వ తరగతి బాలిక జె.మేఘన... తృతీయ స్థానం సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ పి.ప్రకాష్‌బాబు చేతుల మీదుగా వీరికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు నూరుద్దీన్, ఉపాధ్యాయులు అనుజ, అపర్ణ, వెంకటేశ్వరరెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా అట్లతదియ వేడుక

నగరంలో అట్లతద్ది పండగను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి... పరస్పరం వాయినాలు ఇచ్చుకున్నారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఊయలల వద్ద సందడి చేశారు.


– న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు



నిర్మల్‌నగర్‌లో ఊయల ఊగుతున్న ఓ మహిళ

నవోదయలో ప్రవేశాలకు ఆహ్వానం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానాచార్యులు వీకే గీతాలక్ష్మి తెలిపారు. ఒంగోలు విద్యాలయం పరిధిలోని 29 మండలాల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ధ్రువీకరణ పత్రం జత చేయాలన్నారు. విద్యాలయ సమితి వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంచామన్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఈ నెల 30 వరకు గడువు ఇచ్చినట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి ఎనిమిదో తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది

అభ్యాస వైకల్యం... 'ప్రశస్త'తో ప్రయోజనం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: పిల్లల్లో అభ్యాస రుగ్మతకు సంబంధించిన డైస్లెక్సియాపై సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గద్దలగుంటలోని ఓరియంటల్ ఉన్నత పాఠశాల నుంచి నగరంలోని ప్రధాన మార్గాల్లో ఇది సాగింది. ముఖ్య అతిథిగా సమగ్ర శిక్ష సహిత విద్య జిల్లా సమన్వయకర్త ఎం.రమేష్ మాట్లాడుతూ... ఈ సమస్యతో బాధపడే పిల్లలకు బోధించేందుకు ప్రశస్త అన్న యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రధానోపాధ్యాయిని పద్మావతి మాట్లాడుతూ... అభ్యాస వైకల్యాలు ఏడు రకాలని, అందులో డైస్లెక్సియా ఒకటని వివరించారు. సరైన శిక్షణతో దీనిని అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సరస్వతి, సహితవిద్య ఉపాధ్యాయులు మాలిక్ మొహిద్దీన్, నాగేంద్రమ్మ, సురేష్, ఆనంద్, రవికుమార్, సృజన, వీరబ్రహ్మం, చంద్రశేఖర్, సంధ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

'ఇళ్ల మధ్య మద్యం దుకాణం తగదు'

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: పెద్ద బజారులో దేవాలయాలు, గ్రంథాలయానికి సమీపంలో ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఏర్పాటుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని ఉప తహసీల్దార్ ఎన్.మాబు సుభానీకి కొందరు స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ దుకాణం ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. అర్జీ ఇచ్చిన వారిలో ఉమాశంకర్, ఎస్.సుధారాణి, ఎస్.వరలక్ష్మి, ఎస్.కేశవరావు, ఎస్.మల్లేశ్వరరావు, ఎస్.కొండలరావు తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ పదవికి రాజీనామా

ఒంగోలు నగరం: జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ పదవికి పి.ప్రకాష్‌బాబు రాజీనామా చేశారు. నాలుగున్నరేళ్లుగా ఆయన ఆ స్థానంలో కొనసాగారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో రాజీనామా సమర్పించారు. మొత్తం తొమ్మిది మంది సభ్యుల్లో... మరి కొందరు సైతం రాజీనామాలు చేసినట్లు తెలిసింది. త్వరలో అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు చేస్తారని సమాచారం.

పిడుగు పాటుతో గృహోపకరణాల ధ్వంసం

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: పిడుగు పాటు కారణంగా శనివారం... మన్నంవారిపాలెంలోని పలు ఇళ్లలో టీవీలు, ఫ్యాన్లు, ఇతర విద్యుత్తు ఉపకరణాలు దెబ్బతిన్నాయి. విద్యుత్తు స్తంభం తీగలు సైతం తెగిపడ్డాయి. సమాచారం అందుకున్న ఆ శాఖ సిబ్బంది వచ్చి తీగలను సరిచేశారు.

నిర్మల్‌నగర్... చెత్తతో చిక్కులు

పలు ప్రాంతాల్లో సేకరించిన వ్యర్థాలను రంగారాయుడు చెరువు పక్కన పారబోస్తున్నారు. అది దారంతా విస్తరించి, దుర్వాసన వెలువడుతుండడంతో అటుగా వ్యాహ్యాళికి వెళ్లేవారు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గత వారం రోజులుగా విద్యుత్తు సరఫరా సైతం సరిగా ఉండడం లేదని... రోజుకు కనీసం మూడుసార్లయినా అంతరాయం కలుగుతోందని నిర్మల్‌నగర్ వాసులు వాపోతున్నారు. చెత్త తరలింపుతో పాటు, నాణ్యమైన విద్యుత్తు సరఫరా దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు



చెరువు పక్క మార్గంలో పోసిన వ్యర్థాలు

'మాస్టర్ ప్లాన్'తో ముంపు సమస్యకు పరిష్కారం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: బృహత్తర ప్రణాళిక అమలు చేస్తేనే నగరంలో ముంపు సమస్య తీరుతుందని సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కొల్లా మధు పేర్కొన్నారు. ఒంగోలు కార్పొరేషన్‌గా మారి పన్నెండేళ్లైనా అవసరమైన వసతులు కల్పించలేదన్నారు. వచ్చే ఇరవై ఏళ్ల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, కాలువలపై ఆక్రమణలు తొలగించి విస్తరిస్తే చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఓ ప్రకటనలో కోరారు.

లంకా దినకర్‌కు సత్కారం

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఇరవై సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్‌గా అమరావతిలో శనివారం బాధ్యతలు చేపట్టిన లంకా దినకర్‌ను... చీమకుర్తికి చెందిన తెదేపా నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. నాయకులు మన్నం వెంకయ్య, వాణిజ్య విభాగం ప్రతినిధులు శిద్దా సుధాకర్, నూకల సుబ్రహ్మణ్యం, బాశం శ్రీనివాసరావు తదితరులు సత్కరించారు.

విజయనగర్ కాలనీ... వసతులకు దూరం

నగరంలోని 31వ డివిజన్‌లో భాగంగా విజయనగర్‌కాలనీలో అంతర్గత రహదారులు సరిగా లేవు. పలు వీధుల్లో నేటికీ మట్టి దారులే ఆధారంగా ఉన్నాయి. వర్షాలకు అవి చిత్తడిగా మారుతుండడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. కాలనీ నుంచి మామిడిపాలేనికి వెళ్లే దారిలో నిండా చిల్లచెట్లు పెరిగి... రాత్రి వేళ ఆ మార్గంలో రావాలంటేనే భయపడుతున్నామని వాపోయారు. అక్కడే మురుగు పేరుకుపోవడంతో పందుల సంచారం ఎక్కువగా ఉంది. కాలనీలోనూ అవి తిరుగుతుండడంతో సమస్యగా మారింది. గత రెండు నెలలుగా మూడో లైన్‌లోని వీధి దీపం వెలగడం లేదు. కాలనీలో సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు



మూడో లైన్‌లో వెలగని దీపం



ఓ అంతర్గత రహదారి పరిస్థితి...

దేవుడు చెరువు... సమస్యలు చూడు!



కాలువ పక్కనే ఉన్న కుళాయి



శర్మ కళాశాల రోడ్డులో పరిస్థితి...

కుళాయిల నుంచి రంగుమారిన కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని దేవుడుచెరువు ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగేందుకు అవి పనికిరాక... బయట డబ్బానీళ్లు కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోయారు. పైపులైన్లు సరిగా లేకనే సమస్య నెలకొందని చెబున్నారు. ఎక్సైజ్ కార్యాలయం దారిలో చెట్ల కొమ్మలు రహదారిపైకి విస్తరించి... విద్యుత్తు తీగలను తాకుతుండడంతో తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతోందని తెలిపారు. కాలువలు సైతం పూడిపోయాయని... సమస్యల పరిష్కారానికి కార్పొరేషన్ అధికారులు చొరవ చూపాలని వారు విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు



చదలవాడలో రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, నాయకులు

పల్లె ప్రగతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా చదలవాడలో రూ.40 లక్షలు, ఉప్పుగుండూరులో రూ.45 లక్షలు, ఈదుమూడిలో రూ.30 లక్షలు, తిమ్మిరెడ్డిపాలెంలో రూ.30 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువల పనులకు శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వ తీరుతో పల్లెల్లో వసతులు కొరవడ్డాయని విమర్శించారు. మండలంలో మొత్తంగా రూ.4.30 కోట్లతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. తెదేపా మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, క్లస్టర్ బాధ్యులు గుమ్మడి సాయిబాబా, కాకర్ల లక్ష్మీ వరప్రసాద్, ప్రత్యేకాధికారి జేబీరాజ్, డీఈ కృష్ణమోహన్, ఎంపీడీవో మహాలక్ష్మి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, నాయకులు కసిగాల శ్రీను, దాసరి సురేష్, కాట్రగడ్డ చంద్రబాబు, సెల్వం, శంకర్, రామోహనరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు అమ్మన్నరాజా, రాజావెంకటాద్రి తదితరులు

జిల్లా కోర్టు ఆవరణలో స్వచ్ఛ భారత్

ఒంగోలు న్యాయవిభాగం: పరిసరాల పరిశుభ్రతలో భాగంగా శనివారం జిల్లా కోర్టు ఆవరణలో అదనపు జిల్లా జడ్జిలు డి.అమ్మన్నరాజా, టి.రాజావెంకటాద్రి ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. పిచ్చి మొక్కలు తొలగించి, చెత్త ఏరివేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు పి.లలిత, ఎస్.హేమలత, ఎన్.రాధిక, షేక్ ఇబ్రహీం షరీఫ్, పి.భానుసాయి, ఎస్.కోమలవల్లి, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చాకిరి సుధాకర్, న్యాయస్థానాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విజిలెన్స్ అధికారులమంటూ దందా

ఓర్వకల్లు: కేంద్ర విజిలెన్స్ అధికారులమంటూ జాతీయ రహదారిపై అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఐదుగురు వ్యక్తులను శనివారం అరెస్టు చేసినట్లు కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, కర్నూలు గ్రామీణ సీఐ చంద్రబాబునాయుడు తెలిపారు. నిందితుల్లో గిద్దలూరుకు చెందిన మధుసూదన్, ఆళ్లగడ్డకు చెందిన అంకిరెడ్డి, నంద్యాలకు చెందిన మహేష్, పాణ్యం మండలం మద్దూరుకు చెందిన దస్తగిర్, ఓర్వకల్లు మండలం ఉప్పలపాడుకు చెందిన ఆళ్ల మధు ఉన్నట్లు చెప్పారు. వారి నుంచి రెండు వాహనాలు, 7 చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జట్ల ఎంపిక

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు మండలం త్రోవగుంట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎండీ హజీరా బేగం ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర, బాలికల వాలీబాల్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల జట్లు ఎంపికలో పాల్గొన్నాయి. సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బ్రహ్మయ్య, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



ఎంపికైన బాలుర జట్టుతో సంఘం ప్రతినిధులు

నగరంలో భారీ వర్షం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: అల్పపీడనం తీరం దాటిందని ఊపిరిపీల్చుకుంటున్న తరుణంలో శనివారం ఉదయం మరోసారి భారీవర్షం పడింది. నగరంలో 28 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కర్నూలురోడ్డు, కొప్పోలురోడ్డు, భాగ్యనగర్ వీధుల్లో నీరు నిలిచిన... కాలువల బాగుకు యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడంతో సమస్య తీవ్రత పెరిగింది. నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి పరిస్థితిని పర్యవేక్షించారు. కాలువల ఆక్రమణ; దుకాణాలు, ఇళ్లముందు వాటిపై ర్యాంపులు నిర్మించడంతో సమస్య నెలకొంటోంది. మస్తాన్‌దర్గా, పాత కూరగాయల మార్కెట్, కొత్తపట్నం బస్టాండ్, బాపూజీ మార్కెట్ ప్రాంతాల్లో ప్రధాన కాలువలకు జేసీబీతో రంధ్రాలు చేసి నీరు తరలించేలా చర్యలు తీసుకున్నారు. కొత్తపట్నం బస్టాండు కూడలిలో కాలువపై ఉన్న పలకలను పగలగొట్టి తాత్కాలికంగా సమస్య తీర్చారు. కమిషనర్ మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం తీసుకుని కాలువలపై ఆక్రమణలు తొలగించి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అగ్రహారం రైల్వే గేటు వద్ద అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు.



పాత కూరగాయల మార్కెట్ వద్ద కాలువను పరిశీలిస్తున్న అధికారులు

కాలువల్లో శుభ్రత పనులు

మద్దిపాడు, న్యూస్‌టుడే: భారీ వర్షాలతో అతలాకుతలమైన మద్దిపాడు, వెల్లంపల్లి, గుండ్లాపల్లి గ్రామాల్లో శనివారం విస్తృతంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పూడికలు తొలగించి... బ్లీచింగ్ చల్లించారు. మద్దిపాడులో సర్పంచి వెంకటేశ్వర్లు, కార్యదర్శి నూరుల్లా పనులను పర్యవేక్షించారు. గుండ్లపల్లిలో సర్పంచి ఆంజనేయులు, కార్యదర్శి లతీఫ్ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు.



జేసీబీతో కాలువలో పూడికలు తీస్తున్న దృశ్యం

విద్యార్థులకు నాణ్యమైన భోజనం తప్పనిసరి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థినులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ ఎ.భారతి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఆమె గిద్దలూరు నగర పంచాయతీలోని జడ్పీ బాలుర, బాలికల పాఠశాలలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించేందుకు పలు సూచనలు చేశారు. వంటశాల, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బంది, భోజన నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం ఆమె గిద్దలూరు సబ్‌జైలును పరిశీలించి ఖైదీలతో మాట్లాడారు. ఆర్థిక స్థోమత లేని ఖైదీలు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఖైదీలకు భోజనం తయారు చేసే సరకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.ఓంకార్, అదనపు కోర్టు న్యాయమూర్తి బి.మేరి సారా ధానమ్మ, సబ్ జైలు పర్యవేక్షకుడు లింగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు అనురాధ, నాగభూషణ్‌రెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

శీతల గోదాముల పన్ను సవరింపు

❖ గిద్దలూరు నగర పంచాయతీకి రూ.4.65 లక్షల ఆదాయం

ఈనాడు కథనానికి స్పందన

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: గిద్దలూరు నగర పంచాయతీలో పన్ను విధింపులో సిబ్బంది చేతివాటంపై ఈ నెల 16న 'ఈనాడు'లో 'పన్నుకు సున్నం... ఖజానాకు కన్నం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన నగర పంచాయతీ కమిషనర్ వెంకటదాసు రెవెన్యూ సిబ్బందిని పంపి గిద్దలూరు - ఒంగోలు రహదారిలోని శీతల గోదాముల విస్తీర్ణాలకు కొలతలు వేయించారు. ఇంటి పన్ను మదింపు చేసే సమయంలో అప్పటి రెవెన్యూ సిబ్బంది కొలతలు తక్కువగా చూపినట్లు గుర్తించారు. గతంలో ఏడాదికి గోదాముల నిర్వాహకులు కేవలం రూ.1.44 లక్షలు పన్ను చెల్లించేవారు. మళ్లీ కొలతలు తీయగా ఏడాదికి రూ.6.09 లక్షలు పన్ను పడింది. అంటే ఒక సంవత్సరానికి నగర పంచాయతీకి రూ.4.65 లక్షల ఆదాయం అదనంగా సమకూరింది. సచివాలయ కార్యదర్శులు తమ పరిధిలో తిరిగి సదరు అసెస్మెంట్లను గుర్తించి పన్ను విధించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

పంట నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం

తాళ్లూరు, న్యూస్‌టుడే: భారీ వర్షాల వల్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. తాళ్లూరు మండలంలోని రామభద్రపురం వద్ద దెబ్బతిన్న జొన్న పంటను, మాధవరం సమీపంలో కుళ్లిపోయిన గుమ్మడికాయల పంటను శనివారం సాయంత్రం ఆయన కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు, ఉద్యానశాఖ డీడీ సుబ్బారెడ్డి పంట నష్టం వివరాలను మంత్రికి తెలియజేశారు. మంత్రి మాట్లాడుతూ.. రైతులకు త్వరలోనే ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా చూస్తామన్నారు. తాళ్లూరులో విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కొందరు రైతులు, ఇతరులు వివిధ సమస్యలపై మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. పొదిలి, తాళ్లూరు, మార్కాపురం, ఇతర ప్రాంతాలకు చెందిన 3,200 మంది రైతులకు చెందిన సజ్జ, జొన్న, పెసర పంటలు దెబ్బతిన్నాయని, రూ.300 నుంచి రూ.400 కోట్ల వరకు పంట నష్టం వాటిల్లినట్లు కలెక్టర్ తెలిపారు. వీటిపై ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ తెదేపా నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఉద్యాన శాఖాధికారి గోపీచంద్, ఏడీఏ బాలాజీనాయక్, తహసీల్దారు కె.నాగలక్ష్మి, ఏవో ప్రసాదరావు, తెదేపా నాయకులు పాల్గొన్నారు. ❖ పొదిలి గ్రామీణం: మండలంలోని కొండాయపాలెంలో మంత్రి స్వామి పర్యటించి వర్షాలకు దెబ్బతిన్న సజ్జ, పొగాకు పంటలను పరిశీలించారు. తెదేపా ప్రభుత్వం రైతుల పక్షపాతి అన్నారు. పంట నష్టం వివరాలను ముఖ్యమంత్రికి వివరించి, ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఏవో జైనులాబ్దీన్, సర్పంచి శ్రీదేవి, అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



రామభద్రాపురంవద్ద మొలకలు వచ్చిన జొన్న కంకులు పరిశీలిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, గొట్టిపాటి లక్ష్మి తదితరులు

కేజీబీవీ కొలువులకు పోటాపోటీ

❖ 51 పోస్టులకు 1,930 దరఖాస్తులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులకు పోటీ తీవ్రంగా ఉంది. మొత్తం 51 పోస్టులకు 1,930 దరఖాస్తులొచ్చాయి. పదో తరగతి వరకు బోధించే సీఆర్‌టీ పోస్టులు 42 ఉండగా 1,331 మంది దరఖాస్తు చేశారు. ఇంటర్ విద్యార్థులకు బోధించే పీజీటీ పోస్టులు ఎనిమిదికి దాదాపు 400 మంది పోటీ పడుతున్నారు. ఇవి కాక బోధనేతర పోస్టులు వార్డెన్ ఒకటి, అకౌంటెంట్ భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. నియామక ప్రక్రియలో భాగంగా శనివారం సీఆర్‌టీ పోస్టులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సమగ్రశిక్షా కార్యాలయంలో ఈ కసరత్తు జరిగింది. 1:5 చొప్పున మెరిట్ ఆర్డర్‌లో అభ్యర్థులను పరిశీలనకు పిలిచారు. సోమవారం మిగిలిన పోస్టుల దరఖాస్తుల పరిశీలన జరగనుంది. అంతా పూర్తయ్యాక ఎంపిక చేసిన వారిలో రోస్టర్ కం మెరిట్ ప్రకారం తుది జాబితా ఖరారు చేస్తారు.



సీఆర్‌టీ పోస్టుల దరఖాస్తులు పరిశీలిస్తున్న సిబ్బంది

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 130, రిటైల్ లైవ్ - 152, చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్- 251

దెబ్బతిన్న పొలాల పరిశీలన

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: భారీ వర్షాలతో ఉప్పుగుండూరులో దెబ్బతిన్న వరి పొలాలను రైతు, కౌలు రైతు సంఘాల ప్రతినిధులు శనివారం పరిశీలించారు. ఆయా సంఘాల జిల్లా అధ్యక్షులు జె.జయంతిబాబు, షేక్ మాబు మాట్లాడుతూ కొమ్మమూరు కొత్తకాలువ పరిధిలో సుమారు 1,500 ఎకరాల్లో వరి పైరుకు నష్టం వాటిల్లిందన్నారు. కాలువకు పడిన గండ్లు పూడ్చకపోతే మళ్లీ నాటుకునే పరిస్థితీ ఉండదన్నారు. 216వ జాతీయ రహదారి నిర్మాణ సమయంలో డ్రైనేజీ వ్యవస్థ నిర్మించక... పొలాల్లోకి వరద చేరి రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. బాధిత రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సంఘాల నాయకులు బసవపున్నయ్య, శ్రీకాంత్, రైతులు మాదాసు నాగేశ్వరరావు, పెంట్యాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్ సుభాని మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్

విధులకు వెళ్లొస్తూ కానిస్టేబుల్ దుర్మరణం

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఒంగోలు-కర్నూలు రహదారిలో చీమకుర్తి మండలం చీమలమర్రి రెడ్డినగర్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్పెషల్ పార్టీలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దూదేకుల మహబూబ్ సుభాని (31) దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. .. మహబూబ్ సుభాని మార్కాపురంలో విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై ఒంగోలు వెళ్తుండగా చీమలమర్రి రెడ్డి నగర్ సమీపంలో ముందుగా వెళ్తున్న లారీ ఒక్కసారిగా వేగం తగ్గడం, ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో మోటార్ సైకిల్ అదుపు తప్పి సుభాని రహదారిపై పడిపోవడంతో తలకు బలమైన గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సీఐ సుబ్బారావు, ఎస్సై కృష్ణయ్యలు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కి తరలించారు. ఎస్పీ దామోదర్ ఆసుపత్రి వద్ద సుభాని మృతదేహానికి నివాళులర్పించారు. సుభానికి భార్య రసూల్‌బీ, రెండేళ్ల పాప ఉన్నారు. రసూల్‌బీ మళ్లీ ఇప్పుడు తొమ్మిది నెలల గర్భిణి. కుటుంబానికి ఆధారమైన సుభాని మృతికి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



సుభాని (పాతచిత్రం)



మృతదేహాన్ని ఒడ్డుకు తెస్తున్న రెస్క్యూ బృందం సభ్యులు

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మద్దిపాడు: గుండ్లకమ్మ జలాశయంలో గల్లంతైన యువకుడి మృతదేహం శనివారం లభ్యమైంది. రాచవారిపాలేనికి చెందిన గంగిశెట్టి బ్రహ్మనాయుడు (30)... గురువారం సాయంత్రం మిత్రులతో కలసి చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. విజయవాడ నుంచి వచ్చిన రెస్క్యూ టీం సభ్యులు... శనివారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. పోస్టుమార్టం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.